





రాజమహేంద్రవరంలో తొలిరోజు ముస్తాబైన మద్యం దుకాణం

బోణీ అదిరింది!

- తొలిరోజు 74 షాపులు ఆరంభం
- షాపులకు వచ్చిన పాత బ్రాండ్లు
- రూ. 7.29 కోట్ల అమ్మకం

రాజమహేంద్రవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తొలి రోజు బోణీ అదిరింది..గల్లా పెట్టె నిండింది. ఐదేళ్ల నుంచీ జగన్ పిచ్చి బ్రాండ్లు తాగి విసిగెత్తిపోయిన మందుబాబులకు నాణ్యమైన సరుకు రావడంతో షాపుల ముందు క్యూ కట్టేశారు. జిల్లాలో 125 షాపులు కేటాయించగా 74 షాపుల్లో బుధవారం నుంచి అమ్మకాలు ప్రారంభించారు.దీంతో తొలి రోజునే మందుబాబులు కిక్కులో మునిగితేలారు. మంగళవారం రాత్రి డిపోల నుంచి సరుకు తెచ్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 74 షాపుల్లో రూ.6.73 కోట్లు,19 బార్‌లలో రూ.1.19 కోట్లు వెరసి రూ.7.92కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఎక్సైజ్ శాఖ ఇప్పటికే 125 షాపులకూ ప్రొవిజనల్ లైసెన్సు జారీ చేసింది. ప్రభుత్వ మద్యం డిపోకు బ్రాండ్లు క్రమంగా వస్తున్నాయి. ప్రస్తుతం ఎంసీ, ఐబీ వంటి రెండు మూడు బ్రాండ్లు వచ్చాయి. ఇక్కడి నుంచి షాపులకు వెళతాయి. విస్కీలో 88, బ్రాందీలో 44, రమ్‌లో 8, వోడ్కా 8, వైన్ 17, జిన్ ఒకటి, బీర్లు 15, బ్రీజర్ 4 రకాలు రానున్నాయి. విస్కీ, బ్రాందీ రూ.120, రమ్, వోడ్కా రూ.230, బ్రీజర్ రూ.130 ప్రారంభ ధరలు కాగా బీరు ధర రూ.120-270 వరకూ ఉంది. ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి వచ్చినా పెద్దగా బ్రాండ్లు ఇంకా రాకపోవడంతో మందుబాబులు షాపుల సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. కొద్ది రోజుల సమయం పడుతుందని వారు సమాధానం ఇస్తున్నారు. హైవేల పక్కన, గుడి, బడికి 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణం ఉండకూడదనే నిబంధనల ఉన్నందు వల్ల వ్యాపారులు అద్దెకు దుకాణాల వెతుకులాటలో ఉన్నారు. గత ప్రభుత్వ దుకాణాలు అద్దెకు లభించినవారు మాత్రం బుధవారమే తెరిచేశారు. మరికొంత మంది షాపులు ఎక్కడ ఏర్పాటు చేయాలనే మీమాంసలో ఉన్నారు. పూర్తిగా అన్ని షాపులూ తెరుచుకోడానికి రెండు మూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉంది.

బస్తాకు తగ్గింపు రూ.200

- దళారుల ఇష్టారాజ్యం
- దిక్కుతోచని రైతాంగం

కోరుకొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టించి అప్పులు పాలై అష్ట కష్టాలు పడి ధాన్యం పండిస్తే వాతావరణ పరిస్థితులు సాకుగా చూపి దళారులు రైతులను మోసం చేస్తున్నారు. కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు బీపీటీ 5204 సాంబమసూరు, భయ్యా సాంబ రకాలను అధికంగా సాగు చేశారు. ఇవి సన్న రకాలు కావడం వల్ల మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుందని భావించారు.పచ్చిధాన్యం 75 కేజీలు కాటా ఒక్కింటికి రూ.1700లు ఇస్తామని చెప్పడంతో గత మూడు రోజులుగా సార్వా మాసూళ్ళు ప్రారంభించారు. తీరా ధాన్యం బస్తాల్లో దింపి అమ్మే సమయానికి రూ.200 ధర తగ్గింది ఇస్తే ఇవ్వండి లేకపోతే వద్దంటూ దళారులు సిండికేట్‌గా మారి చక్రం తిప్పుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టుకుని అమ్ముకుందామంటే అల్పపీడనం ప్రభావంతో వాతావరణం అనుకూలించక మా ధాన్యం పట్టుబడి చేయండి అంటూ ధాన్యం వ్యాపారులు, దళారులు చుట్టూ రైతులు తిరుగుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని నాలుగు రోజులు కిందట కాటా రూ.1700 లకు కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.1500లు మాత్రమే ఇస్తున్నారు.బస్తాకు రూ.200లు నష్టపోయి ఎకరానికి రూ.10 వేలు పోగొట్టుకుని దళారుల వద్ద ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ధాన్యానికి సరైన ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఎంబుక్ నిర్వహణ తీరుపై కలెక్టర్ ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16 : జిల్లాలో మనబడి మన భవిష్యత్తులో 655 పనులకు సంబంధించి రెండో దశ పనుల రికార్డుల నిర్వహణ విషయంలో ఇంజనీరింగ్ సహాయకులు నిర్లక్ష్యవైఖరిపై కలెక్టర్ ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు ఇంజనీరింగ్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో చేపట్టిన మనబడి మనభవిష్యత్తు స్కూల్ తరగతి గదుల నిర్మాణం ,అభివృద్ధి,మౌలిక వసతులు కల్పనకు ఖర్చుల రికార్డుల ఆడిటింగ్‌పై కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం సమీక్షించారు. సుమారు రూ.200 కోట్ల పనులను నాలుగు ఇంజనీరింగ్ విభాగాలు పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వశిక్షా అభియాన్ , మునిసిపల్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందన్నారు.ఎంబుక్ నిర్వహణలో లోపాలపై వారం రోజుల్లో తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా సర్వశిక్షా అభి యాన్ అధికారి ఎస్ సుభాషిణి, సహాయ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

వై' కేటగిరీ సిటీగా రాజమహేంద్రవరం!

ఎంపీ వినతిపై కేంద్రం సానుకూలం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం సిటీని వై కేటగిరీలోకి చేర్చాలని కోరుతూ ఇటీవల రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర గృహనిర్మాణ, పట్టణవ్యవహారాల శాఖ మంత్రికి రాసిన లేఖకు సానుకూల స్పందన లభించింది. లేఖ సంబంధిత డిపార్టుమెంట్ పరిశీలనలో ఉందని ఎంపీ పురందేశ్వరికి సమాచారం అందింది.ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం సిటీ వై కేటగిరీలోకి చేరితే ఇక్కడ పనిచేస్తున్న రైల్వే, ఎల్ఐసీ వంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల సూచికమేరకు ప్రస్తుతం రాజమహేంద్రవరం సిటీ జడ్ కేటగిరీలో ఉంది. దీంతో ప్రస్తుతం ఇక్కడి రైల్వే, ఎల్ఐసీ, పోస్టల్ తదితర ఉద్యోగులకు 10 శాతం హెచ్‌ఆర్‌ఏ లభిస్తున్నది. ఇది 20 శాతం వరకూ పెరిగే అవకాశం ఉంది. దీంతో పాటు నగరపాలక సంస్థలోని డ్రైనేజీ, పార్కులు వంటి అభివృద్ధికి, మౌలిక సదుపాయాలు కల్పనకు మరిన్ని నిధులు సమకూరుతాయి. త్వరలోనే వై కేటగిరీలోకి ఆమోదం లభిస్తుందని ఎంపీ పురందేశ్వరి ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు.

భార్యను వేధించిన భర్తకు 18 నెలల జైలు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16: భార్యను వేధించిన భర్తకు 18 నెలల జైలు శిక్ష రూ5వేలు జరిమాన విధిస్తూ రాజమహేంద్రవరం ఐదో ఏజెఎఫ్ న్యాయ్యమూర్తి జి.శ్రీనివాసరెడ్డి తీర్పునిచ్చారు. రాజమహేంద్రవరం మహిళా పోలీసుల కథనం ప్రకారం. రాజమహేంద్రవరానికి చెందిన యువతితో 2014లో ఏలూరు మండలం దొండపాడు గ్రామానికి చెందిన మోహనకృష్ణకు వివాహమైంది. 2018లో బాధితురాలు తన భర్త వేధిస్తున్నాడని రాజమహేంద్రవరం మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి బుధవారం మోహనకృష్ణకు 18 నెలల జైలు, రూ.5 వేలు జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

క్వింటా ఏ గ్రేడ్ రకం రూ.2350

జేడీఏ మాధవరావు

బిక్కవోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అధికారులు సూచించిన మేరకు ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు రైతులకు సూచించారు. ఆర్‌ఎస్.పేటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాళ్వా సాగులో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉంటుంది.. అలాగని అధికంగా పురుగు మందులు వాడితే మిత్ర పురుగులు చనిపోతాయన్నారు.. భూసారం కూడ దెబ్బతింటుందన్నారు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర క్వింటా ఏగ్రేడు రకం రూ.2350, కామన్ రకం రూ.2300లకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు తమకు నచ్చిన రైసుమిల్లుకు ధాన్యం విక్రయించుకోవచ్చునని చెప్పారు. సొమ్ములు కూడా అమ్మిన రెండు, మూడు రోజులకు రైతుల ఖాతాలకు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఏడీఏ డివి.కృష్ణ, డీఏటీటీ ఏడీఏలు బి.జయరామలక్ష్మి, ఏవోలు ఎస్. శామ్యూల్‌జాన్, జి.వాణి, వీఏఏ అనిత, కూటమి నేతలు బోను సూర్యకుమార్, మాడా మోహన్, సప్పా మహేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

4న గోదావరి మాతకు టీటీడీ హారతి

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో టీటీడీ ఆధ్వర్యంలో గోదావరి మాతకు నవంబరు 4వ తేదీన మహా మంగళ హారతి (నీరాజనం) అందజేస్తున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం కార్తీకమాసంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గోదావరి మాతకు మహా నీరాజన ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షించారు.టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా ప్రతి ఏడాది కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో కార్తీకమాసంలో గోదారమ్మ మహా నీరాజనం (హారతి) అందించడం జరుగుతుందన్నారు. నవంబరు 4వ తేదీ సోమవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సంకీర్తనా, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, నదీ వైశిష్ట్యం, హారతి వైశిష్ట్యం, కార్తీకదీపం గురించి వివరిస్తామన్నారు. అనంతరం గోదావరి మాతకు హారతిస్తామన్నారు. ఈ హారతి కార్యక్రమానికి భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.వాహనాల పార్కింగ్ స్థలం గుర్తించాలన్నారు.వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వాటర్‌ప్రూఫ్ టెంట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో జి.ఎస్.ఎస్.జవహర్ బాజీ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, పట్టణ సీఐ పి.విశ్వం,కమిషనర్ టి.నాగేంద్రకుమార్,ప్రభుత్వశాఖలఅధికారులు పాల్గొన్నారు.

అమ్మా..లే అమ్మా!

వివాహిత ఆత్మహత్య

అమ్మ మృతదేహం పక్కనే ముగ్గురు చిన్నారుల కన్నీళ్లు

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులు తాళలేక భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంతమూరు భవానీ పురంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోడి అమృత వర్షిణి(21) 2019లో కోడి రమేష్ అలియాస్ మహేష్‌కు ప్రేమ వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు.భర్త ప్రతి రోజు మద్యం సేవించి వేధిస్తుండ డంతో అనేక మార్లు పుట్టింటికి వెళ్లి తిరిగివచ్చేది. అయినా మార్పు లేకపోవడంతో వర్షిణి మంగళవారం రాత్రి ఇంట్లోనే చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పిల్లి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మనోహర్ బుధవారం తెలిపారు.అమ్మ చనిపోయిం దని తెలియని ముగ్గురు చిన్నారులు మృత దేహం పక్కన లేఅమ్మా అంటూ ఏడుస్తుండడంచూపరులనుకంటతడి పెట్టించింది.



కోరంగిలో విదేశీ అతిథుల సందడి..

- అభయారణ్యానికి వేలాదిగా రాక
- ఆరంభమైన సీజన్
- 5 వేల కిలోమీటర్లు పయనం
- ఐదు దేశాల నుంచి వేడర్స్ పక్షులు
- ఆయా దేశాల్లో మంచు కారణం
- గుంపులు..గుంపులుగా సందడి
- అక్టోబరు టు ఫిబ్రవరి ఇక్కడే మకాం
- చంబల్ నుంచీ ఇండియన్ స్కిమ్మర్
- 108 జాతులకు చెందిన పక్షులు
- 40 వేలకుపైగా కనువిందు
- వచ్చే జనవరిలో విదేశీ పక్షుల గణన

ఎక్కడ చైనా.. ఎక్కడ నైజీరియా.. తదితర 8 దేశాలు మ్యాప్‌లో కూడా గుర్తించడం కష్టమే.. నోరు లేని మూగజీవాలు మాత్రం ఆయా దేశాల నుంచి ప్రతి ఏడాది అక్టోబరులో వలస వచ్చేస్తాయి.. ఐదు నెలల పాటు ఇక్కడే ఉంటాయి.. ఒక్కటి కాదు.. వందలు కాదు.. 41 వేలు పైనే 108 జాతులకు చెందిన పక్షులు వస్తాయి. కనువిందు చేస్తాయి.. ఒకసారి ఆ విదేశీ పక్షులను చూడాలని ఉందా.. అయితే ఒకసారి కాకినాడ చెంత ఉన్న కోరంగి అభయారణ్యానికి వెళ్లాల్సిందే.. ఇంకెందుకు ఆలస్యం పదండి.. చూసొద్దాం..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందచందాలకు నెలవైన కోరంగి అభయారణ్యానికి అప్పుడే విదేశీ అతిథుల తాకిడి మొదలైంది. వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ గుంపులు గుంపులుగా వచ్చేశాయి.. ఈ అతిథులు ఇక్కడ ఏకంగా ఐదు నెలలు మకాం వేస్తాయి.. ఇలా వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ ఇక్కడకు వచ్చేది ఎందుకో తెలుసా.. కేవలం ఆహారం కోసం.. పక్షులు ఉండే దేశంలో వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పుల కారణంగా ప్రతి ఏడాది అక్టోబరు నాటికి వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ కాకినాడలోని కోరంగి అభయారణ్యానికి అతిథులుగా వస్తాయి..రష్యా,చైనా, సైబీరియా, మంగోలియా దేశాల నుంచి వందల పక్షులు అభయారణ్యానికి చేరుకున్నాయి. అంతే కాదండోయ్ మధ్యప్రదేశ్,రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న చంబల్ నుంచి ఇండియన్ స్కిమ్మర్ పక్షులు తాజాగా కోరంగికి చేపల కోసం విచ్చేశాయి.

ఎన్నెన్ని అందాలో...

చూడ్డానికి అందంగా, గుబురుగా...దట్టంగా కనిపించే మడ అడవులు దేశంలో కాకినాడకే ప్రత్యే కం. నదీ జలాలు సముద్రంలో కలిసేచోట చిత్తడినేలల్లో పెరగడమే వీటి ప్రత్యేకత. సాధారణంగా ఉప్పునీటిలో చెట్లు పెరగవు. కానీ కేవలం అందు లోనే పెరిగి, ఊత వేర్లతో ఒకదానికొకటి పెనవేసుకుపోయే చెట్లు,పొదల సముదాయమే మడ అడ వులు. ప్రపంచవ్యాప్తంగా 18 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో ఇవి వ్యాపించగా ఎక్కువగా ఇండోనేషియా,బ్రెజిల్,ఇండియా, బంగ్లాదేశ్‌లో ఇవి ఉన్నా యి. రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో 331.5 చదరపు కిలోమీటర్లలో ఇవి విస్తరించగా, కృష్ణా పరీవాహక ప్రాంతంలో 250 చదరపు కిలోమీటర్లు ఉన్నాయి. అత్యధికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరా ల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా కేంద్రం గుర్తించింది. విస్తీర్ణంలో దేశంలో రెండో అతిపెద్ద మడ అడవులు ఇవి. ఉమ్మడి జిల్లాలో ఈ మడ అడవులను మొత్తం తొమ్మిది అభయారణ్యాలుగా గుర్తించారు. ఇందులో కోరంగి అభయారణ్యం అతి పెద్దది. ఇది 42.42 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఆ తర్వాత కోరంగి విస్తరణ (194) భైరవపాలెం (9.71), రాతి కాల్వ 20.43,మాసానితిప్ప (10.89) మట్లతిప్ప (04.45), బలుసుతిప్ప (4.75), కొత్తపాలెం (0.58) కొత్తపాలెం (0.58), కందికుప్ప (38.02) చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ 80 రకాల వృక్షజాతులున్నాయి. కోరంగి అభయారణ్యంలో 24 కుటుంబాలకు చెందిన 35 జాతుల మడ మొక్కలున్నాయి.ఏటా ఎనిమిది దేశాల నుంచి 120 జాతుల విదేశీ,స్వదేశీ వలస పక్షు లు కోరంగికి వస్తాయి. ఏటా అక్టోబర్ నుంచి వివిధ దేశాల పక్షులు రావడం ఆనవాయితీ.. ప్రస్తు తం ఇక్కడకు రష్యా, చైనా, సైబీ రియా,మంగోలియా దేశాల నుంచి వేడర్స్ జాతికి చెంది పక్షులు కొన్ని రోజులుగా వచ్చి విడిది చేస్తున్నాయి. వేడర్స్ పక్షుల్లో మొత్తం 56 జాతులు ఉన్నాయి. ఇవన్నీ గుం పులు గుంపులుగా కోరంగికి వస్తు న్నాయి.గ్రేట్ నాట్, బ్లాక్‌టైల్ గాడ్‌విట్, బ్రోడ్ బిల్డ్ శాండ్ పైపర్, క్లాబ్ ప్లోవర్, గ్రేటర్ ఫ్లెమింగో తదితర జాతులకు చెందిన విదేశీ పక్షులు ఇక్క డకు విడిదిగా మరికొన్ని రోజుల్లో రానున్నాయి.



ఏటా 40 వేల పక్షులు పైనే...

ఏటా అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు ఐదు నెలల పాటు కోరంగికి విదేశీ,స్వదేశీ పక్షుల తాకిడి ఉంటుంది.ఏటా జనవరిలో రెండు రోజుల పాటు కోరింగి అభయారణ్యానికి చెందిన అటవీశాఖ అధికారులు పక్షుల గణాం కాలు సేకరిస్తారు. ఇందుకు పక్షులను గణించే నిపుణులను దేశవ్యాప్తంగా పిలుస్తారు.వీరందరినీ 12 గ్రూపులుగా విభజిస్తారు.ఒక్కో గ్రూపులో ఐదు గురిని ఉంచి రెండు రోజుల పాటు సర్వే చేస్తా రు. వీరంతాఫొటోలు,బైనాక్యులర్స్ ఆధారంగా ఆయా పక్షులు ఏదేశం నుంచి వలస వచ్చా యి? ఎన్ని వచ్చాయి? అనే వివరాలు తయారు చేస్తారు.ఆ తర్వాత పక్షుల సంఖ్యతో కూడిన నివేదికను బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్ఎస్)కు పంపుతారు.దీని ప్రకారం ఈ ఏడాది జనవరిలో కోరంగికి 108 జాతులకు చెందిన 41,131 పక్షులు వచ్చినట్టు లెక్క తేల్చారు. 2017లో 43,718, 2020లో 26,734, 2021లో 34,207, 2022లో 46,546 విదేశీ,స్వదేశీ పక్షులు కోరంగికి వచ్చాయి.ఏటా జనవరిలో కోరంగి అభయారణ్యం,పరిసరాల్లోని 12 ప్రాంతాల్లో సర్వే చేస్తారు.



అక్కడంతా మంచే మంచు...

ఏటా అక్టోబర్ నుంచి రష్యా,చైనా, సైబీరియా, మంగోలియా, ఓమన్, అరబ్ తదితర దేశాల్లో శీతాకాలం ప్రభావంతో విపరీతంగా మంచు కురుస్తుంటుంది. దీని వల్ల అక్కడ పక్షులకు ఆహారం దొరకదు. పచ్చిక బయళ్లు, చెట్లు,అడవులు పూర్తిగా మంచుతో కప్పేసి ఉంటాయి. దీని వల్ల పక్షులకు ఆహార సమస్య ఉంటుంది. దీంతో భూమధ్య రేఖకు దిగువన ఉన్న ఇండియాలోని కోరంగి అభయారణ్యానికి వలస వస్తాయి. ఇలా ఆయా దేశాల నుంచి దాదాపుగా 4,500 కిలోమీటర్ల నుంచి 5,800 కిలోమీటర్ల దూరం ఎగురుకుంటూ ఇక్కడకు చేరుకుంటాయి. ఇక్కడ కోరంగిలో చిత్తడి వాతావరణం, గుబురుగా ఉండే చెట్లు, తక్కువ ఎత్తులో నీరు ఉండడంతో విదేశీ పక్షులకు ఆహారం సులువుగా దొరుకుతుంది. దీని వల్ల వేలాదిగా ఇక్కడకు వస్తాయి. ఏటా ఇక్కడకు వచ్చే పక్షులు 35 వేల వరకు ఉంటాయి.

చంబల్ నుంచీ వచ్చేస్తున్నాయి..

దేశంలోని చంబల్ ప్రాంతం నుంచీ ఇండియన్ స్కిమ్మర్ పక్షుల తాకిడి ఆరంభమైం ది. ప్రస్తుతం 800 వరకు పక్షులు ఇక్కడకు చేరుకున్నాయి. స్కిమ్మర్ జాతి పక్షులు అధికంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో విస్తరించి ఉన్న అభయారణ్యం నుంచి కోరంగికి వస్తాయి. ఇవన్నీ చంబల్,మహానది ప్రాంతంలో పిల్లలను కంటాయి.అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఆహారం కోసం 1,300 కిలోమీటర్లు ఎగురుకుంటూ కోరంగికి వస్తాయి. వీటిని నది ఊడ్చి పక్షి అంటారు. వీటి కింద దవడ పొడవుగా ఉంటుంది. చిత్తడిగా ఉన్న కోరంగి మడ అడవుల్లో బురదను చీల్చి కిందకు దవడను ఉంచి చేపలను వేటాడి తినడం వీటి ప్రత్యేకత.ఇవికాకుండా స్వదేశీ పక్షులు మరిన్ని వచ్చేనెలలో ఇక్కడకు రానున్నాయి.

ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16: ఇసుక ఆన్‌లైన్,ఆఫ్‌లైన్‌కు ప్రత్యేకమైన సిబ్బందిని నియమించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కలెక్టరేట్‌లో జేసీ చిన్నరాముడుతో కలిసి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఇసుక ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ సరఫరా విధానం అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రతిపాయింట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రీచ్‌ల వద్ద విధులు నిర్వహించే వారికి గుర్తింపు కార్డు జారీ చేసినట్టు తెలిపారు. గుర్తింపు కార్డులు ఉన్న వారినే ర్యాంపుల్లోకి అను మతించాలన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ కోసం సిబ్బందికి శిక్షణ ఇచ్చామని.. ఆఫ్‌లైన్‌లో విధులకు హాజరయ్యే సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. మస్టర్ రోల్ తప్పనిసరిగా నిర్వహిస్తూ ,లేబరు హాజరు ,పనితనం పర్యవేక్షణకు చొరవ తీసుకోవాలన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఇసుక రీచ్‌ల వద్ద స్లాట్ కేటాయింపులు అనుసరించి క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. చెల్లింపులు జరిగిన 24గంటల్లో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అంచనాలకు అనుగుణంగా విద్యుత్ శాఖ ఎస్ఈ మెటీరియల్ డంపింగ్ చేయించాలన్నారు.



'బోట్స్‌మెన్ సొసైటీలకు సకాలంలో బిల్లులు'

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రప్రదేశ్) : బోట్స్ మెన్ సొసైటీల ఆధ్వర్యంలో నడిచే ఇసుక ర్యాంపుల నిర్వహకులకు పెండింగ్ లేకుండా ప్రతివారం బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రాత్రి బోట్స్‌మెన్ సొసైటీ నాయకులు, రెవెన్యూ, పోలీస్, ఏజీఆర్‌బీ అధికారులతో సమీక్షించారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు మాట్లాడుతూ బోట్స్‌మన్ సొసైటీల నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. ఆర్డీవో రాణి సుస్మి త మాట్లాడుతూ గురువారం నుంచి పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఇసుక అందుబాటులోకి వచ్చే విధం గా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇసుక కొరత లేకుండా సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పాత బిల్లులు రావడానికి కొంత సమయం పడుతుందన్నారు. ఇసుకర్యాంపుల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ పి.విశ్వం, ఏజీఆర్‌బీ ఏఈఈ జి.మణికంఠరాజు, పాకా జయరామ్, ముళ్లపూడి కాశీ, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.



చెత్త సమస్య వినరు.. కనరు! 8

రాజమహేంద్రవరంలో టాటా ఇన్నోవేషన్స్ హబ్ 6

1120 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం 7



ప్రమాదమా..

ఆ తొలి గంటే కీలకం!

నేడు వరల్డ్ ట్రామా డే

జీవితం అనిశ్చితం.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు. అకస్మాత్తుగా ఏదో రోడ్డు ప్రమాదానికో గురై గాయాలు కావచ్చు. అనుకోకుండా మంటలు చెలరేగి చర్మం కాలవచ్చు. హఠాత్తుగా పనిచేస్తున్న పరిశ్రమలోనో లేదా పెద్దవాళ్లు ఏ బాత్‌రూమ్‌లోనో జారిపడిపోతే గాయపడొచ్చు. ఇలా అనుకోకుండా ప్రమాదం జరగడం, ప్రమాదవశాత్తూ గాయాలపాలైతే వైద్య పరిభాషలో ట్రామా కేసులుగా పరిగణిస్తారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కోసం ప్రతీ ఏడాదీ అక్టోబరు 17న వరల్డ్ ట్రామా డేగా నిర్వహిస్తుంటారు.



(పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లోనే ట్రామా కేసులెక్కువ. దీనివల్ల తలకు గాయాలు, ఎముకలు విరగడం వంటివి జరుగుతాయి. ప్రతీ ఏటా రోడ్డు ప్రమాదాలకు మన ప్రాంతంలోనే వందలాది మంది మరణిస్తుండగా, వేలాది మంది తీవ్రగాయాలపాలవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే ప్రమాదాలకు సంబంధించి జరిగిన సర్వేల్లో ప్రతి ఆరు సెకండ్లకు ఒక మరణం సంభవిస్తోందని తేలింది. దేశవ్యాప్తంగా కూడా ఏటా 10 లక్షల మంది మృతి చెందడంతోపాటు రెండు కోట్ల మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. యువతలో సంభవించే మరణాల్లో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినవారు అందులో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు వారే ఎక్కువ. యాక్సిడెంట్లలో లేదా పెద్దవయసు కారణంగా తలకు గాయలు, ఎముకలు విరగడాలు, రోడ్డు ప్రమాదాలు ఇతరత్రా ప్రమాదాల్లో తలకు గాయం కావడం మామూలే. పెద్దవయసు వారిలో మజిల్ మాస్ తగ్గడం, కాళ్లలో స్పర్శజ్ఞానం మందగించడం, అకస్మాత్తుగా స్పృహ తప్పడం, అకస్మాత్తుగా బీపీ తగ్గిపోవడం, కొందరిలో పక్షవాతం, పార్కిన్సన్స్ డిసీజ్ కారణాలతో పడిపోతే తలకు గాయాలు, ఎముకలు ప్రధానంగా తుంటి ఎముక వంటివి విరగడంలాంటివి జరగవచ్చు.

ప్రమాదాల్లో ముందుగా పరిశీలించాల్సిన లక్షణాలు..

- స్పృహ కోల్పోవడం, ఫిట్స్ రావడం
- రెండు అంతకన్నా ఎక్కువ వాంతులు కావడం, చెవి, ముక్కులోంచి రక్తం రావడం
- ప్రమాదానికి ముందు మొదలుకుని 30 నిముషాలలోపు జరిగిన సంఘటనలు గుర్తులేకపోవడం
- తలకు గాయాలైతే తక్షణ సాయంగా ముందుగా అంబులెన్స్ ద్వారా పారా మెడికల్ లేదా ఎమర్జెన్సీ వైద్య సిబ్బంది నుంచి సహాయం అందాలి.
- ఆసుపత్రికి తీసుకొచ్చాక ఎమర్జెన్సీలోనే చికిత్స ప్రారంభంకావాలి. ఎందుకంటే మెదడుకు జరిగిన నష్టాన్ని మళ్లీ భర్తీ చేయడం కష్టం కాబట్టి చికిత్స త్వరగా అందాలి.
- రక్తస్రావం అవుతుంటే దాన్ని ఆపాలి.

రోడ్డు ప్రమాదాలు.. ప్రథమ చికిత్స

సహాయంకోసం పిలవడం (కాల్ ఫర్ హెల్ప్). దీనివల్ల సమీప హాస్పటల్‌కు బాధితుల్ని వీలైనంత త్వరగా తరలించడానికి వీలవుతుంది. దగ్గర్లోని ఆసుపత్రి వివరాలను అంతకంటే ప్రధానంగా అంబులెన్స్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవడం మంచిది.

తలను కదల్చకుండా ఉంచేలా..

తొలుత తలను కదల్చకుండా (హెడ్ ఇమ్మొబిలైజేషన్) ఉంచాలి. ఎందుకంటే తలకు గాయాలైన సందర్భాల్లో మెడకూ, వెన్నుపూసకు గాయాలైనప్పుడు తలను కదల్చకుండా ఉంచడం వల్ల వెన్నుపూసలకు సంబంధించి అనర్థాలను నివారించినట్లవుతుంది.

రక్తస్రావాన్ని అరికట్టడం..

రక్తస్రావం జరగడం రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయాలకు దారితీసే ప్రధాన అంశం. అందుకే రక్తస్రావాన్ని అరికట్టడం రోడ్డు ప్రమాద చికిత్సలో కీలకమైన అంశం. ముందుగా రక్తస్రావానికి కారణమైన తీవ్ర గాయం ఏదైనా ఉందేమో పరిశీలించాలి. గాయం కనిపిస్తే దానిపై తగినంత ఒత్తిడితో రక్తస్రావం ఆగేలా చేయాలి. శుభ్రమైన గుడ్డ లేదా గాజుగుడ్డను కూడా ఇందుకు ఉపయోగించవచ్చు. గాయంపై శుభ్రమైన గుడ్డతో రెండు చేతులతో ఒత్తిడి కలిగిస్తూ పది నిమిషాలు అలాగే ఉంచాలి. ఒకవేళ పైన చెప్పినట్టు పది నిమిషాలపాటు ఒత్తిపట్టినా రక్తం ఆగకపోతే ఏదైనా గుడ్డతో గాయంపై రక్తం ఆగేందుకు గట్టిగా కట్టుకట్టి అలా ఎంతసేపు కట్టి ఉంచారో వైద్య బృందాలకు తెలియజేయాలి. అయితే ఇలా గట్టిగా ఒత్తిపట్టి ఉంచడమన్నది కాళ్లు లేదా చేతుల విషయంలోనే జరగాలి తప్ప శరీర భాగాల్లోని మిగతా చోట్ల చేయకూడదు.

కంటి గాయాలు..

కంటికి అనేక రకాలుగా గాయాలయ్యే అవకాశముంది. రైతులు పొలాల్లో నడిచే సమయంలో ముళ్ల చెట్లు, తుప్పలు కంటికి కొట్టుకోవడం, ఇటుక, ఇసుక లారీల్లోంచి పార్టికిల్స్ వచ్చి కళ్లల్లో పడడం, రాత్రి ప్రయాణాల్లో పురుగుల కళ్లకు కొట్టుకోవడం వంటి ప్రమాదాలు జరిగి కళ్లు గాయపడవచ్చు. ఇక పిల్లల విషయానికి వస్తే బంతి, షటిల్ కాక్ వేగంగా ఎగిరివచ్చి కంటికి తగలచ్చు. అలాంటప్పుడు ఈ కింది విషయాలను గమనించాలి.

- కన్నునొప్పి, కంటి వాపు
- కంట్లో ఏదైనా పడినట్టు (ఫారిన్ బాడీ) అనిపించడం
- మసగ్గా కనిపించడం, ఏమీ కనిపించకపోవడం

అందించాల్సిన ప్రథమ చికిత్స..

పొలాల్లో మందు పిచికారీ చేస్తున్నప్పుడు కంట్లో పడితే దాని ప్రభావం తగ్గించడానికి నీళ్లతో కంటిని కడగాలి. రోడ్డు ప్రయాణంలో ఫుల్ ఫేస్ హెల్మెట్ వాడాలి. బంతి/షటిల్ కాక్ కళ్లకు తగలగానే వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి. ఒకగ్లాస్ నీళ్లు తీసుకుని కన్ను ముంచి రెప్పలను ఆడిస్తూ ఉండాలి. కొద్దిసేపటికి ఈ నీళ్లను మారుస్తూ ఉండాలి. కంటి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లేలోపు కంటిని నలపకూడదు.

కాలిన గాయాలు - జాగ్రత్తలు..

గాయం కాగానే కంగారు పడకుండా దానిపై నీళ్లు ధారగా పడేలా చూసుకోవాలి. అలాగే కనీసం 10 నిమిషాలపాటు మంట తగ్గేవరకూ కడగాలి. కాలినప్పుడు బట్ట చర్మానికి అంటుకుంటే దాన్ని తీయకూడదు. డాక్టర్ మాత్రమే దాన్ని తొలగిస్తారు. కాలిన గాయాలపై క్లింగ్ ర్యాప్ (తినే పదార్థాలపై కప్పే ట్రాన్స్‌పరెంట్‌తో చుట్టడంగానీ లేదా కప్పడంగానీ చేయాలి).

- గాయాన్నీ కడగడానికి గది ఉష్ణోగ్రతతో ఉన్న నీళ్లనే వాడాలి. ఐస్ వాటర్ వద్దు. కాలిన గాయం మందం మన అరచేయి మందంలో సగానికంటే ఎక్కువగా ఉన్నప్పుడు లేదా రసాయనాల వల్ల కాలిన గాయమైతే బాధితుల్ని వెంటనే డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాలి. గాయాన్ని ఎప్పుడూ రుద్దకూడదు. గాయాలపై పసుపు, పేస్టు నెయ్యి వంటివి రాయకూడదు.

- డాక్టర్ పి.సరిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో, పెద్దాపురం







అల్పపీడనం.. అనంత వర్ణాలు

ఆకాశం ఎన్నెన్నో వర్ణాలతో అలరిస్తోంది. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు అనుగుణంగా నింగి కూడా రకరకాల రంగుల్లో కనిపిస్తోంది. మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వర్షం పడుతుండడంతో ఆకాశం నీలి, బంగారు, పసుపు రంగుల్లోకి క్షణాల్లో మారిపోతోంది. మబ్బుల మాటున ఈ వర్ణరంజితమైన ఆకాశం ఆకర్షణీయంగా దర్శనమిస్తోంది. చిత్రాలు.. బుధవారం కాకినాడ కల్పన సెంటర్ బ్రిడ్జి వద్ద కారు మబ్బుల వలయం.. ఉప్పాడ తీరంలో ఎగిసిపడుతున్న సముద్ర కెరటాల పైన కనువిందైన దృశ్యం. - కాకినాడ/కొత్తపల్లి

బతుకులు మారాలి..

అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం సందర్భంగా..



వేకువనే నిద్ర లేచి గుడెసె బయట కట్టెల పొయ్యిపై వంట

- సంచార జీవనం.. ఇప్పటికీ బుడిగె జంగాల తీరు
- పూట గడవాలంటే ఊరూరా తిరగాల్సిందే
- పందిరి గుడెసెలే వారి భవంతులు

ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు పేద బతుకులకు కొంత ఆసరాగా ఉంటున్నప్పటికీ వారి బతుకు చిత్రాల్ని మాత్రం పూర్తిగా మార్చలేకపోతున్నాయి. దీంతో తమ బతుకు కంటే తమ బిడ్డల బతుకులు కాసింత మేలుగా ఉండాలన్న తపన.. అందుకు వారు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అటువంటి జీవితాలు సమాజంలో మన కళ్ల ముందు ఎన్నో కనిపిస్తుంటాయి. అందులో ఒకరు బుడిగె జంగాలు.

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

రోజూ అభివృద్ధి, సంక్షేమం.. ఈ రెండు మాటలూ వింటూనే ఉంటుంటాం. పాలకులు ఏలోటూ రానివ్వకుండా చూసుకుంటున్నామని గొప్పలు చెప్పడాన్నీ ఆలకిస్తుంటాం. నిజంగా అలాంటి వెలుగే ఉంటే ఇదిగో ఇలా సంచార జీవితంతో బతకాల్సిన అగత్యం ఎందుకొస్తుంది. వీరికి చెట్ల కింద పందిరి గుడెసెలే వారి భవంతులు. వేకువనే నిద్రలేవడం.. కట్టెల పొయ్యిపై చారెడు బియ్యం ఉడకేసుకోవడం... భార్యాభర్తలిద్దరికీ చెరో క్యారేజీ సర్దుకోవడం... రాత్రి మిగిలిన సద్దితినడం. ఊళ్లల్లోకి పరుగులు పెట్టడం. ఇది వారి నిత్య జీవన యాత్ర. పాత సామాన్లు కొనడం, వాటిని తిరిగి అమ్ముకోవడం వచ్చిన ఆ కాస్త లాభంతో పూట గడపుకోవడం వారికి నిత్య కృత్యం. ఇదే వారి జీవితం. వారికంటూ భూమి పుట్రా ఏమి లేదు. నాలుగు గోడల ఇళ్లూ లేవు. బ్యాంకు బాలెన్సులు అంతకంటే ఉండవు. ఒక్కో సీజనులో ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకొంటుంటారు. అందుకే వారిని సంచార జీవులంటారు. కాసింత ఎక్కువ చెట్లున్న ప్రాంతమైతే చల్లగా ఉంటుందని ఆ ప్రదేశాన్ని ఎంపిక చేసుకొని అక్కడే పందిరి గుడెసెలు వేసుకుంటుంటారు. వ్యాపారం చేసే బుడిగె జంగాలది ఒక్కో సీజనులో ఒక్కో ఊరు. దీంతో వయసు పైబడిన వారి తల్లిదండ్రులను వారితో పాటే వారి పిల్లల్ని వారి సొంతూర్లలోనే ఉంచేస్తుంటారు. ఇక ఇక్కడి వ్యాపారంలో వచ్చిన సొమ్ములతో వీళ్లు బతుకుతూ తల్లిదండ్రులకు, పిల్లలకు కూడా పంపిస్తుంటారు. అదే సొమ్ములతో పిల్లల చదువులు కూడా. దీంతో వారి సంతానం తల్లిదండ్రులను వదిలేసి నెలల తరబడి ఉండాల్సిన పరిస్థితి. ఒక్కో నెల సరిగా వ్యాపారం సాగని పక్షంలో పూట గడవని పరిస్థితిని ఎదుర్కొంటుంటారు. ఎన్ని గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నా చివరకు వారి బతుకు ఆసరా కేవలం పాడైన సామాన్లు, పాత న్యూస్ పేపర్లు మాత్రమే. వారిలో కొందరు గొడుగులు, గ్యాస్ పొయ్యిల మరమ్మత్తులు చేస్తుంటారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్న కోడు కొండ గ్రామం నుంచి కొన్ని సంచార బుడిగె జంగాల కుటుంబాలు చింతూరు మండలం చట్టి గ్రామంలో గుడెసెలు వేసుకున్నాయి. తమ పిల్లలను పెద్దవాళ్లకు అప్పగించి జీవనోపాధి కోసం వచ్చినట్టు వారు చెప్పారు. ఆడామగా తేడా లేకుండా అందరూ తలోపనీ చేయడం విశేషం.



ఊరూరా తిరిగి పాత బిందెలు కొనుగోలు చేసి తిరిగి నివాస గుడెసెల వద్దకు చేరుకుంటున్న మహిళ



పాత వస్తువులను కొనుగోలు చేసుకుని వచ్చిన తర్వాత విడదీస్తున్న దృశ్యం



సంచార జీవితంలో గొడుగులు బాగు చేసే పనిచేస్తున్న దృశ్యం

ఇవే మా బతుకులు

అన్ని రోజులు పాత సామాన్లు దొరకవు. ఆరోజు ఊరంతా తిరిగినా కష్టమే మిగులుతుంది. మా పెద్దలది ఇదే బతుకు మాదీ ఇదే బతుకు. వానకాలమైతే వ్యాపారం సాగక పూట గడవడమే కష్టమవుతుంది. పిల్లలకైనా మంచి బతుకు దొరుకుతుందేనన్న ఆశ మాది.

- నిడుగొండ రామకృష్ణ

రాజమండ్రిలో రతన్‌టాటా ఇన్నోవేషన్స్ హబ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రక రాజమహేంద్రవరంలో ప్రముఖ వ్యాపారవేత్త రతన్‌టాటా పేరు మీద రతన్‌టాటా ఇన్నోవేషన్స్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో 5 చోట్ల ఈ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గోదావరి జిల్లాలకు కేంద్రంగా రాజమహేంద్రవరంలో ఒక హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సెంట్రల్ హబ్ అమరావతిలో ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజమహేంద్రవరం అభివృద్ధికి ఈ హబ్ ఎంతో ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

గోదావరి మాతకు మహా నీరాజనం

కొవ్వూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు మహానీరాజనం అందజేశారు. ఆశ్వయుజ కో - జాగరి పౌర్ణమిని పురస్కరించుకుని గోదావరి నీరాజన సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రదోషకాలంలో క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో గోదావరిమాతకు 229వ మాసోత్సవ మహా నీరాజనంలో భాగంగా పూజలు చేశారు. నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో గోదావరిమాతకు అష్టోత్తర శత కుంకుమార్చనలు నిర్వహించి, వివిధ రకాల హరతులతో మహా నీరాజనం నిర్వహించారు. మహిళలు నేతి దీపాలు వెలిగించి నదిలో వదిలారు. కార్యక్రమంలో పట్టణ, పరిసర ప్రాంతాల భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీ

మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వాగ్దానాలను మరచి పట్టభద్రులను, ప్రజలను మోసం చేసిన ప్రభుత్వాలను కౌన్సిల్‌లో తన వాణిని వినిపించేందుకు ఒకరిని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి(స్వతంత్ర అభ్యర్థిగా) దింపుతున్నట్టు అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంతో పాటు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. వాగ్దానాలను నిలబెట్టుకోలేని పక్షంలో ప్రభుత్వాలను రద్దు చేసేలా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాలన్నారు. దళితులపై దాడులు పెరుగుతూనే ఉన్నాయి కాని తగ్గలేదన్నారు. అందుకే నిరుద్యోగులు, దగాపడిన వారి కోసం పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీకి తన మనిషిని దింపుతున్నానని ఆయన తెలిపారు.



రాజానగరం మండలం వెలుగుబందలో కావడి ఉత్సవంలో అయ్యప్ప భక్తులు

కన్నుల పండువగా కావడి ఉత్సవం

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగుబంద గ్రామంలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప కావడి మహోత్సవం క్రతువు కన్నుల పండుగా నిర్వహించారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు పన్నీరు కావడి, పాల కావడితో గ్రామోత్సవం జరిపార. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం స్వాములకు బిక్ష, సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం అనంతరం అయ్యప్ప స్వామి పడిపూజా కార్యక్రమాలు అయ్యప్ప శరణు ఘోష మధ్య వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తులు బసవా రాంబాబు 18వ పర్యాయం అయ్యప్ప మాలధారణ దీక్షను పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో మండలంలోని అయ్యప్పలతో పాటుగా పరిసర గ్రామాల అయ్యప్ప మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఖుష్బూ మెచ్చిన ఉప్పాడ చీర

న్యూఢిల్లీ ఎగ్జిబిషన్‌లో కొనుగోలు

కొత్తపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న నుంచి దేశ రాజధాని న్యూఢిల్లీలో జరుగుతున్న వస్త్ర ప్రదర్శన, అమ్మకాల్లో భాగంగా సినీ నటి ఖుష్బూ ఉప్పాడలో తయారు చేసిన జాంధానీ చీరలు కొనుగోలు చేశారని ప్రదర్శనలో పాల్గొన్న కాకి గంగాధర్ తెలిపారు. ఇప్పటివరకు చేనేత జాంధానీ చీరలు పేరు వినడమే కాని చూడడం ఇదే ప్రథమం అని ఆమె అన్నారని తెలిపారు. ఉప్పాడ జాంధానీ చీర ధరిస్తే ఆ హరాందా వేరేగా ఉంటుందని ఖుష్బూ ప్రశంసించారని గంగాధర్ చెప్పారు.



అమ్మవారి ఊరేగింపులో భాగంగా కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా అమ్మవార్ల ఊరేగింపు

గోకవరం, అక్టోబరు 16: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గోకవరంలో బుధవారం అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. వీరభద్రుని గద్దెలోని కనకదుర్గమ్మను, దేవీచౌక్ సెంటర్‌లో దుర్గామాతను పూలతో అలంకరించి వేర్వేరు రథాలపై ఉంచి గరగ నృత్యాలు, కోలాటం, నవదుర్గ నృత్యాలు, తీన్మార్ వాయిద్యాల మధ్య గ్రామంలో ఘనంగా ఊరేగించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు బారులుతీరారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



సత్యదేవుడికి దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ అధికారి పూజలు

అన్నవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో బుధవారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సేఫ్టీ అధికారి వెంకటరెడ్డి సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనాలు అందజేశారు.

వేదాశీర్వచనం పొందుతున్న రైల్వే సేఫ్టీ అధికారి వెంకటరెడ్డి

పాదగయలో హుండీల ఆదాయం రూ.46.29లక్షలు


పిఠాపురం పాదగయ క్షేత్రంలో హుండీలలో లెక్కించిన డబ్బు

పిఠాపురం, అక్టోబరు 16: కాకినాడజిల్లా పిఠాపురం పట్టణం పాదగయ క్షేత్రంలో హుండీలను బుధవారం తెరిచారు. పాదగయలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లు, దత్తాత్రేయస్వామి సన్నిధిలో, ఇతర ప్రాంతాల్లో ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ.46,28,750ల ఆదాయం లభించింది. 210రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ పి.విశ్వనాథరాజు, దేవదాయశాఖ తనిఖీదారు వి.ఫణికుమార్, దేవస్థానం, చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకుల సిబ్బంది, శ్రీవారి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాకినాడలో ఏలూరు రేంజ్ ఐజీ వార్షిక తనిఖీలు


రికార్డులను తనిఖీ చేస్తున్న ఐజీ అశోక్‌కుమార్

కాకినాడ క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు,దర్యాప్తు, కేసుల పురోగతి, పెండింగ్ కేసుల వ్యవహారం తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దన్ని పారదర్శకతతో, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సిబ్బంది దైనందిన జీవితంలో ఎటువంటి అనారోగ్యం దరిచేరకుండా వ్యాయామం చేస్తూ తగిన పోషకాహారం తీసుకుంటూ వ్యసనాల జోలికి వెళ్లకుండా ఉంటే జీవితం సాఫీగా సాగుతుందన్నారు. తద్వారా పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐజీ వెంట ఎస్పీ విక్రాంత్ పాటిల్, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, త్రీటౌన్ సీఐ కేవీవీ సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

తీరంలో అలల ఉధృతి


కెరటాల ఉధృతికి మాయాపట్నంలో కొట్టుకొనిపోయిన మత్స్యకారుల ఇళ్లు

- మాయాపట్నంలో 8 గుడెసెలు నేలమట్టం
- మత్స్యకారుల నివాసాల్లోకి దూసుకొస్తున్న కెరటాలు

కొత్తపల్లి, అక్టోబరు 16: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తీరప్రాంతాల్లో కెరటాలు తారాస్థాయిలో ఎగసిపడుతు న్నాయి. ఉవ్వెత్తున ఎగసిపడే రాకాసి అలలు నేరుగా మత్స్యకారుల గుడెసెలవైపు దూసుకొస్తున్నాయి. దీంతో కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం మాయాపట్నంలో 8 గుడెసెలు సముద్రంలో కలిసిపోయాయి. పెంకుటిల్లులపై కప్పు కొట్టుకొనిపోగా మొండి గోడలు ఒడ్డున దర్శనమిస్తున్నాయి. సముద్ర కెరటాల ధాటినుంచి రక్షణగా సూరా డపేటలో గతంలో నిర్మించిన జియో ట్యూబ్‌లపై నుంచి కెరటాలు వేగంగా మత్స్యకారుల ఇళ్లల్లోకి పోటెత్తుతున్నాయి. ప్రతీసారీ తుఫాన్, అల్పపీడనాలు ఏర్పడినప్పుడల్లా తీరప్రాంతాల్లో నివాసం ఉండే మత్స్యకారుల పరిస్థితి చాలా దయనీయంగా మారుతోంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది ప్రజాప్రతినిధులు వచ్చినా తీరప్రాంత రక్షణకు ఎటువంటి శాశ్వత రక్షణచర్యలు చేపట్టకపోవ డంపట్ల మత్స్యకారులు నిట్టూర్పులు విడవడం గమనార్హం. సము ద్రం కల్లోలంగా ఉండటంతో తీరప్రాంత గ్రామాలకు చెందిన మత్స్యకారులు బోట్లను రామన్నపాలెం, శీలంవారిపాలెం ఉప్పుటేరువద్ద లంగర్‌వేసి భద్రపరిచారు. ఇంజన్లు, విలువైన వలలు ఇతర సామాగ్రిలను ఇళ్లవద్దకు తరలించి జాగ్రత్త చేసుకున్నారు.


మాయాపట్నం మత్స్యకారుల నివాసిత ప్రాంతాల్లోకి చేరిన సముద్రం నీరు

వరుస తుపాన్‌లతో జీవనోపాధికి గండి

ఇటీవల వరుస తుపాన్‌లు సంభవించ డంతో తీరప్రాంత మత్స్యకారు లు జీవనోపాధికి గండి ఏర్పడింది. ఈ యేడాది వేట నిషేద సమయంలో మత్స్యకారులకు అందాల్సిన వేట పరిహారం ఇప్పటికీ మంజూరు కాకపోవడం, వరుసు తుపాన్‌లతో ఉపాధి లేకపోవడం వం టి కారణాలతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. వేట లేకపోయినా, పరిహారం అందక పోయినా వడ్డీలకు అప్పులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటు న్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.


ప్రజలను అప్రమత్తం చేస్తున్న కూనవరం ఎస్ఐ లతాశ్రీ, ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ కరుణాకర్

పులి ఉంది జాగ్రత్త..

- పాలగూడెం జంక్షన్‌లో పులి సంచారం
- అప్రమత్తం చేసిన ఎస్ఐ, ఎఫ్ఆర్‌వో

కూనవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండల పరిధిలో పులి సంచరిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూనవరం ఎస్ఐ లతాశ్రీ, ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ కరుణాకర్ అన్నారు. పులి సంచరిస్తున్న ఆయా గ్రామాల్లో ప్రజలను బుధవారం అప్రమత్తం చేశారు. మండలంలోని పెదనర్సింగపేట, దుగుట్ట, కాచవరం గ్రామాల్లో ఈసందర్భంగా చాటింపులు వేయించారు. పెద్ద పులి పశువులపై ఎటువంటి దాడి చేసిన, పులి ఆనవాళ్లు తెలిసిన వెంటనే అటవీశాఖాధికారులు, పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పులి హాని చేస్తుందన్న భయంతో ఎటువంటి విషపూరిత ఆహారం పెట్టడం, కరెంటు తీగలు అమర్చడం వంటివి చేయవద్దని రేంజర్, ఎస్ఐ హెచ్చరించారు.

పాలగూడెం జంక్షన్‌లో పులి

పాలగూడెం జంక్షన్, బోదునూరు పరిసరాల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు బుధవారం రాత్రి గుర్తించారు. పులి సంచరించేందుకు అనువైన ప్రదేశాలు ఈప్రాంతంలో ఉన్నాయి. డీఎఫ్‌వో భవిత, సబ్ డీఎఫ్‌వో కేవీఎస్ రాఘవరావు ఆదేశాల మేరకు ఈప్రాంతంలో సిబ్బందిని ఏర్పాటు చేశామని అటవీ శాఖాధికారి కరుణాకర్ తెలిపారు.

ఆడ పులి జాడ కోసమేనా..?

ప్రస్తుతం మండలంలో సంచరిస్తున్న ఆడ పులి జాడ కోసమే పయనిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అటవీశాఖాధికారుల లెక్క ల ప్రకారం 2012 నుంచి ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుంది. ఆంధ్ర-చత్తీస్‌ఘడ్ సరిహద్దు ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అధికారులు అంచ నా వేస్తున్నారు. ఒక వేళ ఇప్పుడు సంచరిస్తున్న పులి మగ పులి అయితే వర్షాకాలం ముగుస్తున్న సమయంలో 60 స్క్వేర్‌కట్ పరిధిలో పులి తన సరిహద్దులను ఏర్పాటు చేసుకునే అవకాశముంది. పులి ఏర్పా టు చేసుకున్న సరిహద్దుల పరిధిలోకి ఇతర మగ పులులు రాకుండా సరిహద్దు చుట్టూ ఉన్న చెట్లపై తన కోరలతో రక్కి గుర్తులు పెడుతుంది. ఇది గమనించిన ఇతర పులులు ఆ పులి సరిహద్దులోకి వెళ్లవు. అంతేకాకుండా ఆడ పులులను ఆకర్షించడానికి సరిహద్దు చుట్టూ తన మూత్రం పోసి ఆడ పులులను ఆకర్షిస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతం పులి ఇక్కడ సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పులి రామచంద్రపురం అడవు ల్లో దూగుట్టకు రెండు కిలోమీటర్ల పరిధిలో పులి ఓ చెరువు దగ్గర నీళ్ల తాగినట్లు బుధవారం అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పులి తన పనిని ముగించుకుని తన సొంత ప్రాంతానికి ప్రయాణమైనట్లు అధికారులు భావిస్తున్నారు. ఏదేమైనా మండలంలో పులి సంచరిస్తుందని తెలియడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కరప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వివాహ వేడుకకు లైటింగ్ బిగిస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో ఒక యువకుడు మృతి చెందాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కె.గంగవరం మండలం వట్రపూడి గ్రామానికి చెందిన శీలం నారాయణమూర్తి కుమారుడు ప్రవీణ్‌కుమార్ (17) అద్దంపల్లి గ్రామానికి చెందిన యనమదల గోవింద్ అనే ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద లైటింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కరప మండలం కొంగోడు గ్రామానికి చెందిన అనుపతి శ్రీను ఇంట్లో వివాహ వేడుకకు సంబంధించిన లైటింగ్ పనుల్లో ప్రవీణ్‌కుమార్ నిమగ్నమయ్యాడు. నిచ్చెన ఎక్కి లైట్లు బిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. క్షతగాత్రుడ్ని గొల్లపాలెం పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత బుధవారం జిల్లాకోర్టు ఆవరణలో అండర్ ట్రయిల్ ముద్దాయిల కమిటీ మీటింగ్, ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణలో ఉన్న ముద్దాయిల కేసుల దర్యాప్తు, చార్జ్ షీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిల్ జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. సంబంధిత న్యాయస్థానాలకు తగిన సిఫార్సులు చేశారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యక్రమాలను, బాధితుల పరిహారం సంబంధిత అంశాల ను ఆమోదించారు. హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. డిసెంబరు 14న జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారయోగ్యమైన వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాల న్నారు. ఈ సమావేశంలో 1వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్, జిల్లా ఎస్పీ డీఎన్ కిశోర్, కాకినాడ అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీఆర్ పీబీ ప్రసాద్, రాజమహేంద్రవరం జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, గవర్నమెంట్ ప్లీడర్ సీహెచ్ ప్రసాద్, కొత్తపేట, అమలాపురం డీఆర్‌డీవోలు, సెంట్రల్ జైలు, మహిళా జైలు అధికారులు పాల్గొన్నారు.

అత్తారింటికి వెళ్తూ అనంతలోకాలకు..

- ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి


మృతి చెందిన జాలిపర్తి సుధీర్

గోపాలపురం, అక్టోబరు 16: అత్తారింటికని బయల్దేరి తాను నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం లోని గోపవరం, రాంపాలెం గ్రామాల మధ్య బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కే.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గోపవరం గ్రామానికి చెందిన జాలిపర్తి సుధీర్(30) కరగపాడుకు చెందిన కొక్కిరిపాటి దుర్గశ్రీకి గత రెండేళ్ల క్రితం వివాహమైంది. అయితే గోపవరంలోని ఒక ప్రయివేటు కంపెనీలో జీవనోపాధి కోసం పనిచేస్తున్న సుధీర్ కరగపాడులో అత్తారింటి వద్ద ఉన్న తన భార్యను తీసుకురావడానికి డ్యూటీకి సెలవుపెట్టి గోపవరం నుంచి తన ద్విచక్రవాహనంపై బయల్దేరి కరగపాడు వెళ్తుండగా మార్గమధ్యంలో రాంపాలెం శివారులో తాను నడుపుతున్న వాహనం అదుపుతప్పి రాయిని ఢీకొనడంతో సుధీర్ అక్కడికక్కడే మృతి చెందాడని అన్నారు. మృతుని భార్య దుర్గాశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో పౌర సరఫరాల అధికారులు

1120 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రేషన్(పీడీఎస్) బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్టేడియం రోడ్డు సమీపంలోని ఓ షాపులో పేదల బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారంతో దాడులు చేశామని అధికారులు తెలిపారు. 1120 కిలోల బియ్యం మూటలను సీజ్ చేశామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన నాగేంద్రబాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని, నిఘా పటిష్టం చేశామని చెప్పారు. రేషన్ బియ్యాన్ని విక్రయించడం, అక్రమంగా నిల్వ చేయడం వంటివి నేరమన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో రాజమహేంద్రవరం డివిజన్ అసిస్టెంట్ సివిల్ సప్లయిస్ అధికారి ఎం.నాగాంజనేయులు, డీటీలు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం సీతంపేట మూలగొయ్యి మలుపు వద్ద డ్రైనేజీలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. కృష్ణాజిల్లా గుణదల ప్రాంతానికి చెందిన కె.శ్రీహరిప్రసాద్(51) స్థానిక గోకవరం బ స్టాండ్‌వద్ద ఒక హోటల్‌లో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా మూలగొయ్యిలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అతనికి ఇక్కడ ఎవ్వరూ లేరు. ఈ క్రమంలో ఈనెల 13నుంచి శ్రీహరి కనిపించడంలేదు. బుధవారం స్థానికులు డ్రైనేజీలో ఒక వ్యక్తి మృతదేహాన్ని గమనించి త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆ మృతదేహం శ్రీహరిదిగా గుర్తించారు. అతడికి ఒక కాలికి పుండ్లు ఉండడంతో కాలు సరిగ్గా పనిచేయదని, మద్యం అలవాటు ఉందని, డ్రైనేజీ గోడపై కూర్చుని మందు తాగుతాడని ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ అందులో పడి ఉంటాడని స్థానికులు పోలీసులకు చెప్పారు. ఈ మేరకు పోలీసులు శ్రీహరి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. కృష్ణాజిల్లా గుణదల ప్రాంతంలోని అతడి బంధువులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

- 16.738 కాసుల బంగారం, 7.810 కిలోల వెండి స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

కడియం, అక్టోబరు 16: కడియపులంక చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది జూన్ 18న కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు ఇంట్లోకి దొంగలు ప్రవేశించి 108 గ్రాముల బంగారం, 3 కిలోల వెండి, రూ.1,08,000 నగదు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐ వై.రాంబాబు సిబ్బంది తో కలిసి కడియపులంకలో చాకలి రేవువద్ద గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పిల్లి సురేష్ అలియాస్ శివను, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన కాండ్రేగుల శ్రావణకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం ఒప్పుకున్నారు. చోరీ సొత్తును అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన పోతంశెట్టి గోపాలకృష్ణారెడ్డికి విక్రయించేందుకు ఉంచినట్టు తెలిపారు. నిందితులు పెనుగొండలో రెండు, ప్రకాశం జిల్లా దర్శిలో ఒకటి, బాపట్ల జిల్లా చందోలులో ఒకచోట దొంగతనాలు చేసినట్టు ఒప్పుకున్నారు. కడియపులంకలో దొంగిలించిన వస్తువులతో పాటు, పెనుగొండ, దర్శిలో నేరాల్లో దొంగిలించిన బంగారు వస్తువులు మొత్తం 16.738 కాసులు, 7.810 కిలోల వెండి వస్తువులను స్వాధీన పరుచుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కడియపులంకలో కేసు ఛేదించడంలో కృషిచేసిన సీఐలు వెంకటేశ్వరరావు, రాంబాబు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ మృతి కేసులో

ముగ్గురి అరెస్టు

- వివరాలు వెల్లడించిన చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా


నిందితులు వంతుల జయసేన, కిలో పరుశురాం, కిలో దాసు

మోతుగూడెం, అక్టోబరు 16: అడవి జంతువులను వేటాడటం కోసం ఏర్పాటుచేసిన విద్యు త్ తీగలు తగిలి ప్రాణాలు కోల్పోయిన సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.తిరునావు కరసు కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చింతూ రు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మెట్టగూడెం గ్రామం పైవీధి శివారున ఉన్న అటవీ ప్రాంతంలో అదే గ్రామానికి వంతల జయసేన్, కిలో పరుశురాం, కిలో దాసు అడవి జంతు వుల ను వేటాడటం కోసం విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేశారు. 6.3 కేవీ విద్యుత్ లైన్‌కి ఈ ఉచ్చు కలిపారు. ఈనెల ఆరో తేదీన సీఆర్పీఎఫ్ పార్టీ కూంబింగ్ నిర్వహిస్తుండగా ఏఎస్ఐ తిరునా వుకరసు ఈ ఉచ్చు తగులుకుని ప్రాణాలు కోల్పోయారు. దీనిపై కేసు నమోదు చేసిన డొంకరాయి పోలీసులు నిందితులను బుధవారం అరెస్టు చేశారు. ఇంతకుముందు నిందితులు ఈ విధంగానే జంతువులను వేటాడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. కరెంటు ఉచ్చు వేయడానికి ఉపయోగించిన సర్వీసు వైర్లు, వెదురు బొంగు కర్రలు, గెడ బొంగు, ఐరన్ బైండింగ్, జీవైర్, ప్లాస్టిక్ గొట్టాలను నిందితులను వారి ఇంటి వద్ద పొదల్లో దాచిపెట్టగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం వారిని రిమాండ్‌కు పంపారు. అటవీ జంతువులను వేటాడటం నేరమని, వేట కోసం కరెంటు ఉచ్చువేస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కరెంటు ఉచ్చులు ఏ గ్రామాల్లో అయినా, ఏ ప్రదేశంల్లో అయినా తారసపడితే పోలీసులకు చెప్పాలని, కరెంటు ఉచ్చువేస్తున్నట్లు ఎవరిమీద అయినా అనుమానం ఉంటే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కి తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తుని రైల్వేస్టేషన్‌లో మంటలు


తుని రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై ఎగసిపడుతున్న మంటలు

- పరుగులు తీసిన ప్రయాణికులు
- తప్పిన ప్రమాదం

తునిరూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా తుని రైల్వేస్టేషన్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. రెండో నంబరు ప్లాట్‌ఫారంపై ఒక్కసారిగా మంటలు చెల రేగడంతో ప్రయాణికులు పరుగులు తీశారు. సాయంత్రం విశాఖపట్నం వైపు ప్రయాణిం చేందుకు పెద్దఎత్తున ప్రయాణికులు వేచి ఉన్నారు. రైల్వేలైన్ కింద విద్యుత్‌వైర్లుకి షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగాయి. దీంతో రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు పరుగులు తీశారు. అప్రమత్తమైన రైల్వే ఎలక్ట్రికల్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలను అదుపుచేశారు. ప్రమాద సమయంలో తుని రైల్వేస్టేషన్ మీదుగా ఎటువంటి రైళ్లు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రైల్వే సిబ్బంది త్వరతగతిన మరమ్మతులు చేపట్టి విద్యుత్‌సరఫరా పునరుద్ధరించడంతో ప్రయాణికులు యథావిధిగా రాకపోకలు సాగించారు.

మన్యంలో మద్యం షాపులకు చిక్కులు

- హైకోర్టును ఆశ్రయించేందుకు గిరిజన నేతలు సిద్ధం
- గ్రామసభల తీర్మానం లేని షాపులను రద్దు చేయాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రంపచోడవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మన్యంలో మద్యంషాపుల మంజూరు వివాదంగా మారి, ఆయా షాపులను న్యాయపరమైన చిక్కులు చుట్టుముడుతున్నాయి. గ్రామసభల ఆమోదం లేకుండా మంజూరుచేసిన మద్యం షాపు లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే మరో ప్రక్క హైకోర్టును ఆశ్రయించేందుకు గిరిజన సంఘాల నేతలు సిద్ధమ వుతు న్నారు. బుధవారం గిరిజన సంఘం అధ్యక్షుడు లోతా రామారావు జిల్లా కలెక్టరుకు, అఖిల భారత రైతుకూలీ సంఘం డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవికి వినతులను అందించి షాపుల రద్దుకు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలో మంజూరైన 40 షాపులలో 18 షాపులు రంపచోడవరం, చింతూరు డివిజన్లలోనే ఉన్నాయి. గిరిజన ప్రాంతాల పంచాయతీరాజ్ చట్టం (పీసా) నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లో మద్యం విషయంలో గ్రామసభల తీర్మానాలు అవసరం. ఇక్కడ మద్యం షాపుల లైసెన్సులను ఆయా గ్రామసభల ఆమోదం పొందాకే జారీ చేయాలని కూటమి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టంగా పేర్కొంది. గ్రామసభల తీర్మానాల కోసం ఎక్సైజ్ అధికారులు ఆయా పంచాయతీలను కోరిన 4 వారాల్లో గ్రామసభల నుంచి ఎటువంటి తీర్మానాలు రాకుంటే ఆయా గ్రామసభలు షాపుల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్టే భావించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. కాగా అధికారులు గిరిజన చట్టాలను, ప్రభుత్వ ఉత్తర్వులను ఖాతరు చేయకుండా షాపుల లైసెన్సులు జారీ చేశారని గిరిజనుల ఆరోపణ.

మద్యం షాపులు తెరిచి మూసేశారు

మన్యంలో మద్యం షాపులను ఆయా లైసెన్స్‌లు బుధవారం తెరిచినట్టు తెరిచి ఆ వెంటనే మూసేశారు. పీసా చట్టం కింద గ్రామసభల తీర్మానాలు లేకుండా షాపులను మం జూరు చేసిన అంశంలో వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు జాగ్రత్త పడ్డారు. రంపచోడవరంలో మంజూరైన రెండు షాపు లను నిర్వహించుకునేందుకు మద్యం లైసెన్స్‌లు ఏర్పాటు చేసుకోగా ఇప్పటికే రంపచో డవరం హైవేమీద షాపు ఏర్పాటు చేసుకోవడానికి ప్ర భుత్వ నిబంధనలే అడ్డు వస్తుండగా, దేవీపట్నం రోడ్‌లో ఏర్పాటుచేయాలనుకుంటున్న షాపును బస్‌స్టాండ్, బ్యాంకులు, విద్యాలయాలను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఏర్పాటు చేయరాదంటూ ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ షాపుల ఏర్పాటు విష యంలో సందిగ్ధత నెలకొంది. గ్రామసభల తీర్మానాల అంశంలో వస్తున్న వత్తిడి, న్యాయపరమైన చిక్కుల నేపథ్యంలో ఆయా మండలాల్లో మంజూరైన షాపులకు సంబంధించి ఆయా లైసెన్స్‌లే గ్రామసభల తీర్మానాల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీంతో ఆయా సర్పంచ్‌లపై వత్తిడి తెస్తూ అనుకూలంగా గ్రామసభల తీర్మానాలను పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గ్రామసభల వ్యవహారం తేలేవరకూ మన్యంలో మద్యం షాపులను తెరిచే అంశం ప్రశ్నార్థకమే అవుతోంది.


ఎమ్మెల్యే శిరీషదేవికి ఫిర్యాదు చేస్తున్న రైతుకూలీ సంఘం కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి

అనపర్తి ఎంపీడీవోగా రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎంపీడీవోగా బుధవారం ఎం.రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన కపిలేశ్వరపురం ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై అనపర్తికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీ డీవోగా చేసిన హిమ మహేశ్వరి సామర్లకోటకు బదిలీపై వెళ్లారు. కాగా రామకృష్ణారెడ్డికి కార్యాలయ సూపరింటెండెంట్ బాలాత్రిపుర సుందరి, సిబ్బంది స్వాగతం పలికారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ సబ్జెక్టులో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆసక్తి, అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.హేమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ పీజీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 19వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21న జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ చెప్పారు.

నేటి నుంచి ఎస్‌జీఎస్ జిల్లా క్రీడా జట్లు ఎంపిక

దివాన్‌చెరువు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) వివిధ క్రీడాజట్లు ఎంపిక గురువారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే స్వామి బుధవారం తెలిపారు. ఈ నెల 17న ఫుట్‌బాల్ అండర్-14 బాలురు, బాలికల జిల్లా జట్లు ఎంపిక రాజమహేంద్రవరంలోని ఎస్‌కేటీవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతాయన్నారు. 24న అథ్లెటిక్స్ అండర్-14 బాలబాలికల జట్టు ఎంపికలు 25న అండర్-17 బాలబాలికల జట్టు ఎంపికలు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలలో జరుగుతాయని చెప్పారు. అలాగే 29న బాల్‌బాడ్మింటన్, త్రోబాల్‌లో అండర్-14, 17 బాలికల జట్టు ఎంపికలు, 30న బాలుర జట్టు ఎంపికలు అనపర్తిలోని జడ్పీ హెచ్ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహించనున్నట్టు స్వామి తెలిపారు.

ఎంఈడీలో స్పాట్ అడ్మిషన్స్

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని అనుశ్రీ థియేటర్ ఎదురుగా ఉన్న శ్రీ గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ కాలేజీలో ఎంఈడీ కోర్సులో స్పాట్ అడ్మిషన్స్ జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత పొంది, ఏదేని కళాశాలలో ప్రవేశం పొందని వారు స్పాట్ అడ్మిషన్ కోసం ఈ నెల 21వ తేదీ లోపు కళాశాలలో సంప్రదించి కోర్సులో చేరవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు పని దినాలలో ఫోన్ నెంబరు 9395381133ను సంప్రదించాలన్నారు.

ఉమా విశ్వేశ్వరస్వామికి ఆభరణాలు అందజేత



కోరుకొండ, అక్టోబరు 16: జంబుపట్నంలో నూతనంగా నిర్మించిన ఉమా విశ్వేశ్వరస్వామికి మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన పద్మనాభుడి నాగ వీరప్రకాశరావు జటాజూటం, ఆలయ అర్చకుడు రమణమూర్తి శర్మ నాగాభరణం బహూకరించారు. వీరిద్దరికీ బుధవారం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, ఉల్లి చల్లారావు, ఆలయ కమిటీ సభ్యులు, స్వామివారి శేష వస్త్రం, చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ఉల్లి నాగవిష్ణు, తోరాటి ప్రసాద్, ఉల్లి బుల్లియ్య పాల్గొన్నారు.



చెత్త సమస్యా.. కనరు..వినరు!

కంపుకొడుతున్న పట్టణాలు

- భారంగా చెత్త తరలింపు
- వెన్నాడుతున్న సిబ్బంది కొరత
- పర్మినెంట్ సిబ్బంది లేక ఇక్కట్లు
- తాత్కాలిక కార్మికులతోనే సరి
- అటకెక్కుతున్న స్వచ్ఛభారత్
- అయినా పట్టని అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అధికారులు మాట్లాడితే స్వచ్ఛ భారత్ అంటారు.. అయితే జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో చూస్తే మాత్రం పారిశుధ్యం అధ్వానంగా ఉంది. సిబ్బంది కొరత కారణంగా పట్టణాల్లో పారిశుధ్యం పడకేస్తుంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలులోనూ మరింత మంది పారిశుధ్య సిబ్బంది అవసరం ఉంది. అయినా అటువైపు చూసే వారే కరువయ్యారు. రాజమహేంద్రవరంలో సుమారు నాలుగున్నరలక్షల మంది జనాభా ఉన్నారు. 50 డివిజన్లకుగా నగరం విస్తరించి ఉంది.కొవ్వూరులో 23 వార్డులు, నిడదవోలులో 25 వార్డులు ఉన్నాయి. మూడు పట్టణాల్లోనూ నివాసగృహాలు, వ్యాపార సంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, కూరగాయాలు, నిత్యావసరాలు వ్యాపార సముదాయాలు, హోటల్స్ తదితర వ్యాపార కేంద్రాల నుంచి ప్రతి రోజు పెద్ద ఎత్తున చెత్త వస్తుంది. అయితే ఆ చెత్త తరలించే సిబ్బంది కొరత మాత్రం నేటికి వేధిస్తూనే ఉంది.

పారిశుధ్య కార్మికుల కొరత

రాజమహేంద్రవరం పారిశుధ్యం విభాగంలో 28 సర్కిల్స్ ఉన్నాయి. 28 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నారు. ప్రతి రోజు కార్మికులు రెండు షిఫ్టులుగా పనులు చేస్తుంటారు. ఉదయం 5 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య కార్మికులు పనిచేస్తుంటారు.రాజమహేంద్రవరం వంటి నగరంలో పారిశుధ్య పనులకు తక్కువ అనుకుంటే 2 వేల మం ది కార్మికులు అవసరం.అయితే కార్పొరేషన్‌లో ఉన్న 1150 మంది కార్మికుల్లో డిప్యుటేషన్‌పై 176 మంది అధికారుల ఇళ్లు, ప్రాథమిక ఆసుపత్రుల్లో పనిచేస్తున్నారు.మిగిలిన 974 మంది కార్మికుల్లో డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్లు, వెహికల్ యార్డులో పనిచేసే వారు మినహాయిస్తే సుమారు 800 మంది ఉంటారు. వారిలో పర్మినెంట్ సుమారు 300 మంది ఉంటారు. మిగిలిన 500 మంది కార్మికులు నెంబరు 12 సొసైటీల ద్వారా తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్నారు. సగటున 50 కుటుంబాలకు ఒక్క పారిశుధ్య కార్మికుడు కింద లెక్కించినా నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో ఉన్న కార్మికులు, నగర జనాభాకు ఎంత మాత్రం పొంతనలేని పరిస్థితి. రాజమహేంద్రవరంలో రెండు దశాబ్దాలుగా పారిశుధ్య కార్మికులు సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. ఫలితంగా పారిశుధ్యం ఇబ్బందికరంగా మారుతుంది. దినిపై ఎంత మంది కమిషనర్లు వచ్చినా చర్యలు కానరావడంలేదు. రానున్న పుష్కరాల నేపథ్యంలోనైనా సిబ్బందిని తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి పుష్కరాలకు కార్మికులను తీసుకోవడం అటుపై మళ్లీ వారిని విధుల నుంచి తీసివేయడం జరుగుతుంది.ఈ విధంగా కాకుండా నగరంలో అవసరమైన కార్మికులను నియమించుకోవాల్సి ఉంది.

60 వాహనాల్లో చెత్త తరలింపు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి రోజు చెత్తను తరలించేందుకు సుమారు 60 పైబడి వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ వాహనాల్లో రోజుకు 162 మెట్రిక్ టన్నుల చెత్తను కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. 11 టిప్పర్లు, 17 డంపర్ ప్లేసర్లు, 12 ట్రాక్టర్లు, 40 సీఎన్‌జీ టాటాఏసీ వాహనాల్లో నగరంలో 50 డివిజన్ల నుంచి ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్యలో చెత్త తరలిస్తున్నారు. అయినా నగరంలో ఇంకా చెత్త పేరుకుపోతూనే ఉంది.

డోర్ టూ డోర్ చెత్త సేకరణమే..

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో డోర్ టు డోర్ చెత్త సేకరణ ప్రక్రియ నడుస్తోంది. సుమారు 40 వాహనాలు వినియోగిస్తున్నారు. గతంలో నగరపాలక సంస్థ పుష్ కార్డులను వినియోగించేది. మరి కొంతకాలం రిక్షాలను వినియోగించారు. ఇప్పుడు టాటాఏసీ వాహనాలు వినియోగిస్తున్నారు. గత నెలలో టాటా ఎసీ సీఎన్‌జీ వాహనాలు కాంట్రాక్టు బిల్లుల పెండింగ్ సమస్యలతో నిలిచిపోయింది. దీంతో కార్పొరేషన్ కు ఉన్న 20 వాహనాలపై అదనపు భారం పడి ఇంటింటా చెత్తసేకరణ ఇబ్బందిగా మారింది. మళ్లీ ఇప్పుడు ఆ వాహనాలు రోడ్డెక్కాయి. ఎంత వాహనాలున్నా సిబ్బంది కొరత వెన్నాడుతూనే ఉంది.



చెత్త తరలింపు ఎలా..

కొవ్వూరు/నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లాలో మూడు పట్టణాలు ఉన్నాయి. వీటిలో రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు పట్టణాలు. కొవ్వూరు, నిడదవోలులోను పారిశుధ్య సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. కొవ్వూరులో 125 మంది కార్మికులు ఉండగా 95 మంది పర్మినెంట్ కార్మికులు, 30 మంది తాత్కాలిక కార్మికులు ఉన్నారు. 13 మంది పారిశుధ్య సిబ్బంది కొరత ఉంది. నిడదవోలులోనూ ఇదే పరిస్థితి ఉంది. నిడదవోలులో 120 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. వీరిలో సుమారు 25 మంది మాత్రమే పర్మినెంట్ కార్మికులు. మిగిలిన 95 మంది తాత్కాలిక కార్మికులే. సుమారు 50 మంది కార్మికుల కొరత ఉంది. కొవ్వూరులో అయితే డంపింగ్ యార్డ్‌లేక కార్మికులు నరకం చూస్తున్నారు. మరో వైపు వాహనాలు మూలకు చేరాయి. ప్రస్తుతం ట్రై సైకిళ్లపైనే చెత్త తరలిస్తున్నారు. దీంతో చెత్త తరలింపు భారంగా మారుతోంది.

రాబోయే స్వచ్ఛ సర్వేక్షణలో మంచి ర్యాంకు సాధించాలి
కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16: రాబోయే స్వచ్ఛ సర్వేక్షణలో రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు మంచి ర్యాంక్ సాధించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. బుధ వా రం రాజమహేంద్రవరంలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, వర్మీకంపోస్ట్ యూనిట్లు, లెగసి వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటిం ట చెత్తసేకరణ 100శాతం జరగాలన్నారు. గతం కంటే మెరుగైన ర్యాంక్‌ను సాధించేందుకు అందరు సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం కోటక్ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో దానవాయిపేట మునిసిపాలిటీ స్కూల్లో అభివృద్ధి చేసిన క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వి నూత్న, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, డీఈ విరూపాక్ష, ఏఈ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులు పెట్టొద్దు'

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాలు, విద్యాలయాల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం వేలంలో సిండికేట్లుగా ఏర్పడి షాపులను దక్కించుకున్నారని, ఇందులో అధికార పార్టీ నేతలే ఎక్కువగా ఉన్నారనే ఆరోపణలున్నాయని అన్నారు. మద్యం సిండికేట్లు బెల్టుషాపులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారనే వార్తలు వస్తున్నందున జిల్లా అధికార యంత్రాంగం ఇలాంటి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు.

మెగా రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ బ్లడ్‌బ్యాంకులో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మనం ఫౌండేషన్ అండ్ మణి అన్న బ్లడ్ ఆర్మీసేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పలువురు రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మనం ఫౌండేషన్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానమన్నారు. పెంటగట్ల మణికుమార్, హౌసింగ్‌బోర్డు బ్లడ్ ఆర్మీ సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు లోకా మల్లిబాబు, ఆప్ అధికార ప్రతినిధి కాళ్లూరి కృష్ణమోహన్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

» ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ » కోరుకొండ మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, అక్టోబరు 16: మండల ప్రజానీకానికి అధికారులు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కోరుకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. అధికారులందరూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ పాదర్శకమైన సేవలందించాలన్నారు.వ్యవసాయ, విద్య, వైద్యం, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య, ఉపాధి హామీ, తదితర అధికారులతో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం శాఖల వారీగా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బొరుసు నాగమణి, కొయిడాల స్వర్ణకుమారి, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు దూది కాంతారావు, ముంద్రు సంధ్యారాణి, జాజుల రాము, నక్కా రాంబాబు, ఉల్లి అప్పన్నదొర, కడియాల పాపారావు, ఎంపీటీసీలు కాలచర్ల నాగు, రొంగల దేవిక, ఎంఈవో కుశలవదొర, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సుబ్బారావు, ఏడీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం
అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రానున్న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరానికి విజయం చేకూర్చేందుకు ప్రతిఒక్కరు పూర్తిస్థాయిలో శ్రమిద్దామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలో డివిజన్ ఇన్‌చార్జిలతో జరిగిన సమావేశానికి వాసుతోపాటు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కూటమి నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, అత్తి సత్యనారాయణ, బొమ్ముల దత్తులతో కలిసి మాట్లాడారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల జాబితా, ప్రజాసాధికార సర్వే జాబితా గ్రాడ్యుయేట్లను గుర్తించేందుకు ఉపయోగపడుతుందన్నారు. 90శాతం గ్రాడ్యుయేట్లు కూటమికి అనుకూలంగా ఉన్నప్పటికీ ప్రతి ఓటు నమోదులో శ్రద్ధ వహించాలని వాసు చెప్పారు.

మర్రిపూడి, ఎస్టీ రాజాపురంలో 'పొలం పిలుస్తోంది'

రంగంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపూడి, ఎస్టీ రాజాపురం గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు తమకిష్టమైన రైస్‌మిల్లుకు తరలించుకోవచ్చని, గోనె సంచులు కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు. పంట నమోదు ఆవశ్యకత, వ్యవసాయ యాంత్రీకరణను వివరించారు. ఉద్యానశాఖలో భాగంగా 50 శాతం రాయితీ ద్వారా శాశ్వత పందిర్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అడబాల వెంకటరావు, దవులూరి రాంబాబు, అన్నందేవుల రాంబాబు, అడబాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయల్ ఏసీ డార్మిటరీ హాల్లో పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ మౌనం పాటించారు. అనంతరం ఆయన చిత్రపటానికి సంస్థ ఉపాధ్యక్షుడు గువ్వల వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవత సుధాకర్, లంక సత్యనారాయణ,సిరికిఅక్కునాయుడు,కింతాడ వెంకటరమేష్‌బాబు,తంగేటి దుర్గాప్రసాద్,కొమ్ముల సాయి చక్రవర్తి,వీరభద్రరావు పాల్గొన్నారు.

వర్గీకరణ చేసేది చంద్రబాబే
ఎమ్మార్పీఎస్ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త పేరుపోగు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేసేది సీఎం చంద్రబాబేనని, అందుకే హిందూపురం నుంచి మాదిగల కృతజ్ఞత యాత్ర చేపట్టామని ఎమ్మార్పీఎస్ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి వున్న చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ ఎమ్మార్పీఎస్ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త పేరుపోగు చేపటిన కృతజ్ఞత యాత్ర బుధవారం రాజమహేంద్రవరం చేరుకుంది. ఈ సందర్భంగా రాజమండ్రి గోకవరం బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ వల్ల మాదిగలకు ఒరిగిందేమిలేదన్నారు. వర్గీకరణపై సాధించిన విజయాన్ని మాదిగ అమరవీరులకు అంకితమిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెలో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని, లిడ్‌క్యాప్ ఆస్తులను పరిరక్షించాలని, ట్రైనింగ్ సెంటర్లు నిర్వహించాలని, అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు బల్లంకుల రాజు ఆధ్వర్యంలో నగరంలో డప్పులతో ర్యాలీ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో చెట్టి సుజన్ రావు, బొబ్బిలి వెంకట్రాజు, బల్లంకుల చింటూ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానవరం గ్రామానికి చెందిన బొర్రా త్రినాథ్ అలియాస్ పండు(17) అదృశ్యమైనట్టు కుటుంబీకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పండు స్థానిక గాయత్రి స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడని, 15వ తేదీ రాత్రి ఇంట్లోనే పడుకుని, ఉదయం చూసేసరికి కనిపించలేదంటూ చిన్నాన్న బొర్రా సీతారాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గణేష్ ఎంపిక

కోరుకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదవుతున్న అంగారపు వెంకటగణేష్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కాకినాడ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. జనవరి 10నుంచి 14వ తేదీ వరకు తెలంగాణా రాష్ట్ర మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ తరపున గణేష్ ఆడతాడని ఎంఈవో తెలిపారు. గణేష్‌ను బుధవారం పాఠశాలలో ఎంఈవో టి.కుశలవదొర, హెచ్ఎం మణికుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం రాజేశ్వరి, పీఈటీ రమణమూర్తి, అభినందించారు.

సామూహిక సీమంతాలు

కడియం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వీరవరంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్ బత్తుల నళినిజయంతి అధ్యక్షతన సామూహిక సీమంతాల కార్యక్రమం జరిగింది. దీనికి ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి సీమంతాల కార్యక్రమంలో భాగంగా స్వీట్లు, ఫలాలు అందజేశారు. కార్యక్రమంలో బత్తుల రాము, దొంతంశెట్టి వీరభద్రయ్య, రేమెళ్ళ ప్రసాద్, దొంతంశెట్టి శ్రీను, లంక కనకయ్య పాల్గొన్నారు.



వీరవరంలో సామూహిక సీమంతం

ప్రపంచం గర్వించదగిన వ్యక్తి సాయిబాబా

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ సాయిబాబా ప్రపంచం గర్వించదగిన మహావ్యక్తి, మేధావి అని, ఆయన మృతి తాడిత, పీడిత ప్రజానీకానికి తీరనిలోటని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. సాయిబాబా తాను నమ్మిన సిద్ధాంతం కోసం, ఆశయం కోసం, పీడిత ప్రజల హక్కుల కోసం నిరంతరం పరితపించారని, మడమ తిప్పని యోధుడని కొనియాడారు. ఆదివాసీలపై రాజ్యం సాగిస్తున్న దమనకాండకు సాయిబాబా మృతి ఒక ఉదాహరణ అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కృషి చేయాలని కోరారు.

నవవధువుకు పెళ్లి కానుక

గోకవరం, అక్టోబరు 16: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నవవధువుకు టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ బుధవారం పెళ్లి కానుకను అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా జగ్గంపేట నియోజకవర్గంలోని ఏ పేదింటి ఆడబిడ్డకు వివాహం జరిగినా జ్యోతులు నెహ్రూ ఫౌండేషన్ ద్వారా రూ.20,000 అందజేసినట్టు నవీన్ తెలిపారు. దీనిలో భాగంగా గుమ్మళ్ళదొడ్డిలో జరిగిన వివాహ కార్యక్రమానికి ఆయన హాజరై శెట్టి త్రిమూర్తులు, దుర్గ దంపతుల కుమార్తె నాగేశ్వరి, వరుడు గాజుల వెంకటేశులు దంపతులకు రూ.20,000 నగదును అందజేసారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు మంగరాతి రాము, కోట పెదసూరిబాబు, పెంటిమేని చిన్ని, కోట సత్యవతి, బదిరెడ్డి బాబి, తదితరులు పాల్గొన్నారు.

కోలమూరు, కాతేరులో పల్లె పండుగ

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గాలికి వదిలేస్తే కూటమి ప్రభుత్వం గాడిన పెడుతుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కోలమూరు, కాతేరు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో అనేక పనులకు అంచనాలు సిద్ధం చేశామన్నారు. గతంలో తాను జలమిషన్ పథకం ద్వారా తీసుకువచ్చిన రూ.21 కోట్ల నిధులు అప్పటి ప్రభుత్వం రద్దుచేసిందని ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వ సహకారంతో నిధులు తీసుకువచ్చి ప్రతి ఇంటికీ గోదావరి నీరందిస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

» వీవోఏలు కృషి చేయాలి » శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా వీవోఏలు కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి ఆకాంక్షించారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (సిడ్బీ) ఆధ్వర్యంలో మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా చిన్న పరిశ్రమల ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై మండలంలోని వీవోఏలకు స్థానిక సెర్ప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులంతా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకుంటూ పొదుపు సంఘాల నుంచి అంతర్గత అప్పులు అందించేలా కృషి చేయాలన్నారు. సిడ్బీ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు బ్యాంకుల నుంచి సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేస్తోందని, వాటిని అందిపుచ్చుకుని పరిశ్రమలు స్థాపించుకుని స్వయం సమృద్ధి సాధించాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాల్సిన బాధ్యత వీవోఏలుపై ఉందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమశాఖ ఐపీవో సత్యనారాయణ, ఫుడ్ ప్రొసెసింగ్ సీనియర్ ఎకౌంటెంట్ మాధవి, డీఆర్‌పీఎం హేమంత్, డీఆర్‌పీ సుకాంతి, సెర్ప్ ఏపీఎం గుమ్మడి సునీత, దివాన్‌చెరువు, రాజానగరంలోని వివిధ బ్యాంకుల చెందిన మేనేజర్లు, సెర్ప్ సీసీలు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో కోర్టు భవన నిర్మాణానికి స్థల పరిశీలన

అనపర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలో కోర్టు నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన చేసేందుకు బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు అనపర్తి వచ్చారు. ప్రస్తుతం ఉన్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆర్టీసీకి చెందిన భవనంలో నిర్వహిస్తున్నారు. కొంత కాలంగా కోర్టు ప్రాంగణానికి సొంత భవనం నిర్మించేందుకు అధికారులు స్థల సేకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా జేసీ అనపర్తిలోని పలు ప్రభుత్వ స్థలాలతోపాటు మార్కెట్‌లో రైతుబజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అనపర్తిలో కోర్టు భవనంతో బాటు న్యాయమూర్తి నివాసం ఉండే విధంగా భవన నిర్మాణాలకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. సుమారుగా 45 సెంట్ల స్థలం అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా జేసీ వెంట తహశీల్దార్ అనిల్‌కుమార్, రెవెన్యూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు తదితరులు ఉన్నారు.





రాజమహేంద్రవరంలో తొలిరోజు ముస్తాబైన మద్యం దుకాణం

బోణీ అదిరింది!

- తొలిరోజు 74 షాపులు ఆరంభం
- షాపులకు వచ్చిన పాత బ్రాండ్లు
- రూ. 7.29 కోట్ల అమ్మకం

రాజమహేంద్రవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తొలి రోజు బోణీ అదిరింది..గల్లా పెట్టె నిండింది. ఐదేళ్ల నుంచీ జగన్ పిచ్చి బ్రాండ్లు తాగి విసిగెత్తిపోయిన మందుబాబులకు నాణ్యమైన సరుకు రావడంతో షాపుల ముందు క్యూ కట్టేశారు. జిల్లాలో 125 షాపులు కేటాయించగా 74 షాపుల్లో బుధవారం నుంచి అమ్మకాలు ప్రారంభించారు.దీంతో తొలి రోజునే మందుబాబులు కిక్కులో మునిగితేలారు. మంగళవారం రాత్రి డిపోల నుంచి సరుకు తెచ్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 74 షాపుల్లో రూ.6.73 కోట్లు,19 బార్‌లలో రూ.1.19 కోట్లు వెరసి రూ.7.92కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఎక్సైజ్ శాఖ ఇప్పటికే 125 షాపులకూ ప్రొవిజనల్ లైసెన్సు జారీ చేసింది. ప్రభుత్వ మద్యం డిపోకు బ్రాండ్లు క్రమంగా వస్తున్నాయి. ప్రస్తుతం ఎంసీ, ఐబీ వంటి రెండు మూడు బ్రాండ్లు వచ్చాయి. ఇక్కడి నుంచి షాపులకు వెళతాయి. విస్కీలో 88, బ్రాందీలో 44, రమ్‌లో 8, వోడ్కా 8, వైన్ 17, జిన్ ఒకటి, బీర్లు 15, బ్రీజర్ 4 రకాలు రానున్నాయి. విస్కీ, బ్రాందీ రూ.120, రమ్, వోడ్కా రూ.230, బ్రీజర్ రూ.130 ప్రారంభ ధరలు కాగా బీరు ధర రూ.120-270 వరకూ ఉంది. ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి వచ్చినా పెద్దగా బ్రాండ్లు ఇంకా రాకపోవడంతో మందుబాబులు షాపుల సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. కొద్ది రోజుల సమయం పడుతుందని వారు సమాధానం ఇస్తున్నారు. హైవేల పక్కన, గుడి, బడికి 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణం ఉండకూడదనే నిబంధనల ఉన్నందు వల్ల వ్యాపారులు అద్దెకు దుకాణాల వెతుకులాటలో ఉన్నారు. గత ప్రభుత్వ దుకాణాలు అద్దెకు లభించినవారు మాత్రం బుధవారమే తెరిచేశారు. మరికొంత మంది షాపులు ఎక్కడ ఏర్పాటు చేయాలనే మీమాంసలో ఉన్నారు. పూర్తిగా అన్ని షాపులూ తెరుచుకోడానికి రెండు మూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉంది.

బస్తాకు తగ్గింపు రూ.200

- దళారుల ఇష్టారాజ్యం
- దిక్కుతోచని రైతాంగం

కోరుకొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టించి అప్పులు పాలై అష్ట కష్టాలు పడి ధాన్యం పండిస్తే వాతావరణ పరిస్థితులు సాకుగా చూపి దళారులు రైతులను మోసం చేస్తున్నారు. కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు బీపీటీ 5204 సాంబమసూరు, భయ్యా సాంబ రకాలను అధికంగా సాగు చేశారు. ఇవి సన్న రకాలు కావడం వల్ల మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుందని భావించారు.పచ్చిధాన్యం 75 కేజీలు కాటా ఒక్కంటికి రూ.1700లు ఇస్తామని చెప్పడంతో గత మూడు రోజులుగా సార్వా మాసూళ్ళు ప్రారంభించారు. తీరా ధాన్యం బస్తాల్లో దింపి అమ్మే సమయానికి రూ.200 ధర తగ్గింది ఇస్తే ఇవ్వండి లేకపోతే వద్దంటూ దళారులు సిండికేట్‌గా మారి చక్రం తిప్పుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టుకుని అమ్ముకుందామంటే అల్పపీడనం ప్రభావంతో వాతావరణం అనుకూలించక మా ధాన్యం పట్టుబడి చేయండి అంటూ ధాన్యం వ్యాపారులు, దళారులు చుట్టూ రైతులు తిరుగుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని నాలుగు రోజులు కిందట కాటా రూ.1700 లకు కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.1500లు మాత్రమే ఇస్తున్నారు.బస్తాకు రూ.200లు నష్టపోయి ఎకరానికి రూ.10 వేలు పోగొట్టుకుని దళారుల వద్ద ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ధాన్యానికి సరైన ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

క్వింటా ఏ గ్రేడ్ రకం రూ.2350
జేడీఏ మాధవరావు

బిక్కవోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అధికారులు సూచించిన మేరకు ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు రైతులకు సూచించారు. ఆర్ఎస్.పేటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాళ్వా సాగులో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉంటుంది.. అలాగని అధికంగా పురుగు మందులు వాడితే మిత్ర పురుగులు చనిపోతాయన్నారు.. భూసారం కూడ దెబ్బతింటుందన్నారు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర క్వింటా ఏగ్రేడు రకం రూ.2350, కామన్ రకం రూ.2300లకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు తమకు నచ్చిన రైసుమిల్లుకు ధాన్యం విక్రయించుకోవచ్చునని చెప్పారు. సొమ్ములు కూడా అమ్మిన రెండు, మూడు రోజులకు రైతుల ఖాతాలకు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఏడీఏ డివి.కృష్ణ, డీఏటీటీ ఏడీఏలు బి.జయరామలక్ష్మి, ఏవోలు ఎస్. శామ్యూల్‌జాన్, జి.వాణి, వీఏఏ అనిత, కూటమి నేతలు బోను సూర్యకుమార్, మాడా మోహన్, సప్పా మహేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

4న గోదావరి మాతకు టీటీడీ హారతి

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో టీటీడీ ఆధ్వర్యంలో గోదావరి మాతకు నవంబరు 4వ తేదీన మహా మంగళ హారతి (నీరాజనం) అందజేస్తున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం కార్తీకమాసంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గోదావరి మాతకు మహా నీరాజన ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షించారు.టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా ప్రతి ఏడాది కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో కార్తీకమాసంలో గోదారమ్మ మహీ నీరాజనం (హారతి) అందించడం జరుగుతుందన్నారు. నవంబరు 4వ తేదీ సోమవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సంకీర్తనా, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, నదీ వైశిష్ట్యం, హారతి వైశిష్ట్యం, కార్తీకదీపం గురించి వివరిస్తామన్నారు. అనంతరం గోదావరి మాతకు హారతిస్తామన్నారు. ఈ హారతి కార్యక్రమానికి భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.వాహనాల పార్కింగ్ స్థలం గుర్తించాలన్నారు.వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వాటర్‌ప్రూఫ్ టెంట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో జి.ఎస్.ఎస్.జవహర్ బాజీ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, పట్టణ సీఐ పి.విశ్వం,కమిషనర్ టి.నాగేంద్రకుమార్,ప్రభుత్వశాఖలఅధికారులు పాల్గొన్నారు.

అమ్మా..లే అమ్మా!
వివాహిత ఆత్మహత్య
అమ్మ మృతదేహం పక్కనే ముగ్గురు చిన్నారుల కన్నీళ్లు

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : భర్త వేదింపులు తాళలేక భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంతమూరు భవానీ పురంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోడి అమృత వర్షిణి(21) 2019లో కోడి రమేష్ అలియాస్ మహేష్‌కు ప్రేమ వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు.భర్త ప్రతి రోజు మద్యం సేవించి వేధిస్తుండ డంతో అనేక మార్లు పుట్టింటికి వెళ్లి తిరిగివచ్చేది. అయినా మార్పు లేకపోవడంతో వర్షిణి మంగళవారం రాత్రి ఇంట్లోనే చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పిల్లి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మనోహర్ బుధవారం తెలిపారు.అమ్మ చనిపోయిందని తెలియని ముగ్గురు చిన్నారులు మృత దేహం పక్కన లేఅమ్మా అంటూ ఏడుస్తు ఒడడం చూపరులు కంటతడి పెట్టించింది.



కోరంగిలో విదేశీ అతిథుల సందడి..

- అభయారణ్యానికి వేలాదిగా రాక
- ఆరంభమైన సీజన్
- 5 వేల కిలోమీటర్ల పయనం
- ఐదు దేశాల నుంచి వేడర్స్ పక్షులు
- ఆయా దేశాల్లో మంచు కారణం
- గుంపులు..గుంపులుగా సందడి
- అక్టోబరు టు ఫిబ్రవరి ఇక్కడే మకాం
- చంబల్ నుంచీ ఇండియన్ స్కిమ్మర్
- 108 జాతులకు చెందిన పక్షులు
- 40 వేలకుపైగా కనువిందు
- 2025 జనవరిలో విదేశీ పక్షుల గణన

ఎక్కడ చైనా.. ఎక్కడ నైజీరియా.. తదితర 8 దేశాలు మ్యాప్‌లో కూడా గుర్తించడం కష్టమే.. నోరు లేని మూగజీవాలు మాత్రం ఆయా దేశాల నుంచి ప్రతి ఏడాది అక్టోబరులో వలస వచ్చేస్తాయి.. ఐదు నెలల పాటు ఇక్కటే ఉంటాయి.. ఒక్కటి కాదు.. వందలు కాదు.. 41 వేలు పైనే 108 జాతులకు చెందిన పక్షులు వస్తాయి. కనువిందు చేస్తాయి.. ఒకసారి ఆ విదేశీ పక్షులను చూడాలని ఉందా.. అయితే ఒకసారి కాకినాడ చెంత ఉన్న కోరంగి అభయారణ్యానికి వెళ్లాల్సిందే.. ఇంకెందుకు ఆలస్యం పదండి.. చూసొద్దాం..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందచందాలకు నెలవైన కోరంగి అభయారణ్యానికి అప్పుడే విదేశీ అతిథుల తాకిడి మొదలైంది. వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ గుంపులు గుంపులుగా వచ్చేశాయి.. ఈ అతిథులు ఇక్కడ ఏకంగా ఐదు నెలలు మకాం వేస్తాయి.. ఇలా వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ ఇక్కడకు వచ్చేది ఎందుకో తెలుసా.. కేవలం ఆహారం కోసం.. పక్షులు ఉండే దేశంలో వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పుల కారణంగా ప్రతి ఏడాది అక్టోబరు నాటికి వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ కాకినాడలోని కోరంగి అభయారణ్యానికి అతిథులుగా వస్తాయి..రష్యా,చైనా, సైబీరియా, మంగోలియా దేశాల నుంచి వందల పక్షులు అభయారణ్యానికి చేరుకున్నాయి. అంతే కాదండోయ్ మధ్యప్రదేశ్,రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న చంబల్ నుంచి ఇండియన్ స్కిమ్మర్ పక్షులు తాజాగా కోరంగికి చేపల కోసం విచ్చేశాయి.

ఎన్నెన్ని అందాలో...

చూడ్డానికి అందంగా, గుబురుగా...దట్టంగా కనిపించే మడ అడవులు దేశంలో కాకినాడకే ప్రత్యే కం. నదీ జలాలు సముద్రంలో కలిసేచోట చిత్తడినేలల్లో పెరగడమే వీటి ప్రత్యేకత. సాధారణంగా ఉప్పునీటిలో చెట్లు పెరగవు. కానీ కేవలం అందు లోనే పెరిగి, ఊత వేర్లతో ఒకదానికొకటి పెనవేసుకుపోయే చెట్లు,పొదల సముదాయమే మడ అడ వులు. ప్రపంచవ్యాప్తంగా 18 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో ఇవి వ్యాపించగా ఎక్కువగా ఇండోనేషియా,బ్రెజిల్,ఇండియా, బంగ్లాదేశ్‌లో ఇవి ఉన్నా యి. రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో 331.5 చదరపు కిలోమీటర్లలో ఇవి విస్తరించగా, కృష్ణా పరీవాహక ప్రాంతంలో 250 చదరపు కిలోమీటర్లు ఉన్నాయి. అత్యధికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరా ల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా కేంద్రం గుర్తించింది. విస్తీర్ణంలో దేశంలో రెండో అతిపెద్ద మడ అడవులు ఇవి. ఉమ్మడి జిల్లాలో ఈ మడ అడవులను మొత్తం తొమ్మిది అభయారణ్యాలుగా గుర్తించారు. ఇందులో కోరంగి అభయారణ్యం అతి పెద్దది. ఇది 42.42 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఆ తర్వాత కోరంగి విస్తరణ (194) భైరవపాలెం (9.71), రాతి కాల్వ 20.43,మాసానితిప్ప (10.89) మట్లతిప్ప (04.45), బలుసుతిప్ప (4.75), కొత్తపాలెం (0.58) కొత్తపాలెం (0.58), కందికుప్ప (38.02) చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ 80 రకాల వృక్షజాతులున్నాయి. కోరంగి అభయారణ్యంలో 24 కుటుంబాలకు చెందిన 35 జాతుల మడ మొక్కలున్నాయి.ఏటా ఎనిమిది దేశాల నుంచి 120 జాతుల విదేశీ,స్వదేశీ వలస పక్షు లు కోరంగికి వస్తాయి. ఏటా అక్టోబర్ నుంచి వివిధ దేశాల పక్షులు రావడం ఆనవాయితీ.. ప్రస్తు తం ఇక్కడకు రష్యా, చైనా, సైబీ రియా,మంగోలియా దేశాల నుంచి వేడర్స్ జాతికి చెంది పక్షులు కొన్ని రోజులుగా వచ్చి విడిది చేస్తున్నాయి. వేడర్స్ పక్షుల్లో మొత్తం 56 జాతులు ఉన్నాయి. ఇవన్నీ గుం పులు గుంపులుగా కోరంగికి వస్తు న్నాయి.గ్రేట్ నాట్, బ్లాక్‌టైల్ గాడ్‌విట్, బ్రోడ్ బిల్‌డ్ శాండ్ పైపర్, క్రాబ్ ప్లోవర్, గ్రేటర్ ఫ్లెమింగో తదితర జాతులకు చెందిన విదేశీ పక్షులు ఇక్క డకు విడిదిగా మరికొన్ని రోజుల్లో రానున్నాయి.



ఏటా 40 వేల పక్షులు పైనే...

ఏటా అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు ఐదు నెలల పాటు కోరంగికి విదేశీ,స్వదేశీ పక్షుల తాకిడి ఉంటుంది.ఏటా జనవరిలో రెండు రోజుల పాటు కోరింగి అభయారణ్యానికి చెందిన అటవీశాఖ అధికారులు పక్షుల గణాం కాలు సేకరిస్తారు. ఇందుకు పక్షులను గణించే నిపుణులను దేశవ్యాప్తంగా పిలుస్తారు.వీరందరినీ 12 గ్రూపులుగా విభజిస్తారు.ఒక్కో గ్రూపులో ఐదు గురిని ఉంచి రెండు రోజుల పాటు సర్వే చేస్తా రు. వీరంతాఫొటోలు,బైనాక్యులర్స్ ఆధారంగా ఆయా పక్షులు ఏదేశం నుంచి వలస వచ్చా యి? ఎన్ని వచ్చాయి? అనే వివరాలు తయారు చేస్తారు.ఆ తర్వాత పక్షుల సంఖ్యతో కూడిన నివేదికను బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్ఎస్)కు పంపుతారు.దీని ప్రకారం ఈ ఏడాది జనవరిలో కోరంగికి 108 జాతులకు చెందిన 41,131 పక్షులు వచ్చినట్టు లెక్క తేల్చారు. 2017లో 43,718, 2020లో 26,734, 2021లో 34,207, 2022లో 46,546 విదేశీ,స్వదేశీ పక్షులు కోరంగికి వచ్చాయి.ఏటా జనవరిలో కోరంగి అభయారణ్యం,పరిసరాల్లోని 12 ప్రాంతాల్లో సర్వే చేస్తారు.

అక్కడంతా మంచే మంచు...

ఏటా అక్టోబర్ నుంచి రష్యా,చైనా, సైబీరియా, మంగోలియా, ఓమన్, అరబ్ తదితర దేశాల్లో శీతాకాలం ప్రభావంతో విపరీతంగా మంచు కురుస్తుంటుంది. దీని వల్ల అక్కడ పక్షులకు ఆహారం దొరకదు. పచ్చిక బయళ్ళు, చెట్లు,అడవులు పూర్తిగా మంచుతో కప్పేసి ఉంటాయి. దీని వల్ల పక్షులకు ఆహార సమస్య ఉంటుంది. దీంతో భూమధ్య రేఖకు దిగువన ఉన్న ఇండియాలోని కోరంగి అభయారణ్యానికి వలస వస్తాయి. ఇలా ఆయా దేశాల నుంచి దాదాపుగా 4,500 కిలోమీటర్ల నుంచి 5,800 కిలోమీటర్ల దూరం ఎగురుకుంటూ ఇక్కడకు చేరుకుంటాయి. ఇక్కడ కోరంగిలో చిత్తడి వాతావరణం, గుబురుగా ఉండే చెట్లు, తక్కువ ఎత్తులో నీరు ఉండడంతో విదేశీ పక్షులకు ఆహారం సులువుగా దొరుకుతుంది. దీని వల్ల వేలాదిగా ఇక్కడకు వస్తాయి. ఏటా ఇక్కడకు వచ్చే పక్షులు 35 వేల వరకు ఉంటాయి.

చంబల్ నుంచీ వచ్చేస్తున్నాయి..

దేశంలోని చంబల్ ప్రాంతం నుంచీ ఇండియన్ స్కిమ్మర్ పక్షుల తాకిడి ఆరంభమైం ది. ప్రస్తుతం 800 వరకు పక్షులు ఇక్కడకు చేరుకున్నాయి. స్కిమ్మర్ జాతి పక్షులు అధికంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో విస్తరించి ఉన్న అభయారణ్యం నుంచి కోరంగికి వస్తాయి. ఇవన్నీ చంబల్,మహానది ప్రాంతంలో పిల్లలను కంటాయి.అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఆహారం కోసం 1,300 కిలోమీటర్లు ఎగురుకుంటూ కోరంగికి వస్తాయి. వీటిని నది ఊడ్పు పక్షి అంటారు. వీటి కింద దవడ పొడవుగా ఉంటుంది. చిత్తడిగా ఉన్న కోరంగి మడ అడవుల్లో బురదను చీల్చి కిందకు దవడను ఉంచి చేపలను వేటాడి తినడం వీటి ప్రత్యేకత.ఇవికాకుండా స్వదేశీ పక్షులు మరిన్ని వచ్చేనెలలో ఇక్కడకు రానున్నాయి.



ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16: ఇసుక ఆన్‌లైన్,ఆఫ్‌లైన్‌కు ప్రత్యేకమైన సిబ్బందిని నియమించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కలెక్టరేట్‌లో జేసీ చిన్నరాముడుతో కలిసి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఇసుక ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ సరఫరా విధానం అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రతిపాయింట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రీచ్‌ల వద్ద విధులు నిర్వహించే వారికి గుర్తింపు కార్డు జారీ చేసినట్టు తెలిపారు. గుర్తింపు కార్డులు ఉన్న వారినే ర్యాంపుల్లోకి అను మతించాలన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ కోసం సిబ్బందికి శిక్షణ ఇచ్చామని.. ఆఫ్‌లైన్‌లో విధులకు హాజరయ్యే సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. మస్టర్ రోల్ తప్పనిసరిగా నిర్వహిస్తూ ,లేబరు హాజరు ,పనితనం పర్యవేక్షణకు చొరవ తీసుకోవాలన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఇసుక రీచ్‌ల వద్ద స్లాట్ కేటాయింపులు అనుసరించి క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. చెల్లింపులు జరిగిన 24గంటల్లో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అంచనాలకు అనుగుణంగా విద్యుత్ శాఖ ఎస్ఈ మెటీరియల్ డంపింగ్ చేయించాలన్నారు.



బోట్స్‌మెన్ సొసైటీలకు సకాలంలో బిల్లులు

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రప్రదేశ్) : బోట్స్ మెన్ సొసైటీల ఆధ్వర్యంలో నడిచే ఇసుక ర్యాంపుల నిర్వహకులకు పెండింగ్ లేకుండా ప్రతివారం బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రాత్రి బోట్స్‌మెన్ సొసైటీ నాయకులు, రెవెన్యూ, పోలీస్, ఏజీఆర్‌బీ అధికారులతో సమీక్షించారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు మాట్లాడుతూ బోట్స్‌మన్ సొసైటీల నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. ఆర్డీవో రాణి సుస్మి త మాట్లాడుతూ గురువారం నుంచి పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఇసుక అందుబాటులోకి వచ్చే విధం గా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇసుక కొరత లేకుండా సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పాత బిల్లులు రావడానికి కొంత సమయం పడుతుందన్నారు. ఇసుకర్యాంపుల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ పి.విశ్వం, ఏజీఆర్‌బీ ఏఈఈ జి.మణికంఠరాజు, పాకా జయరామ్, ముళ్లపూడి కాశీ, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.



చెత్త సమస్య వినరు.. కనరు! 8

రాజమహేంద్రవరంలో టాటా ఇన్నోవేషన్స్ హబ్

బైక్‌కు రాయి తగిలి పడి యువకుడి మృతి 8

ఎంబుక్ నిర్వహణ తీరుపై కలెక్టర్ ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16 : జిల్లాలో మనబడి మన భవిష్యత్తులో 655 పనులకు సంబంధించి రెండో దశ పనుల రికార్డుల నిర్వహణ విషయంలో ఇంజనీరింగ్ సహాయకులు నిర్లక్ష్యవైఖరిపై కలెక్టర్ ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు ఇంజనీరింగ్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో చేపట్టిన మనబడి మనభవిష్యత్తు స్కూల్ తరగతి గదుల నిర్మాణం ,అభివృద్ధి,మౌలిక వసతులు కల్పనకు ఖర్చుల రికార్డుల ఆడిటింగ్‌పై కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం సమీక్షించారు. సుమారు రూ.200 కోట్ల పనులను నాలుగు ఇంజనీరింగ్ విభాగాలు పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వశిక్షా అభియాన్ , మునిసిపల్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందన్నారు.ఎంబుక్ నిర్వహణలో లోపాలపై వారం రోజుల్లో తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా సర్వశిక్షా అభి యాన్ అధికారి ఎస్ సుభాషిణి, సహాయ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

వై' కేటగిరీ సిటీగా రాజమహేంద్రవరం!
ఎంపీ వినతిపై కేంద్రం సానుకూలం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం సిటీని వై కేటగిరీలోకి చేర్చాలని కోరుతూ ఇటీవల రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర గృహనిర్మాణ, పట్టణవ్యవహారాల శాఖ మంత్రికి రాసిన లేఖకు సానుకూల స్పందన లభించింది. లేఖ సంబంధిత డిపార్టుమెంట్ పరిశీలనలో ఉందని ఎంపీ పురందేశ్వరికి సమాచారం అందింది.ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం సిటీ వై కేటగిరీలోకి చేరితే ఇక్కడ పనిచేస్తున్న రైల్వే, ఎల్ఐసీ వంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల సూచికమేరకు ప్రస్తుతం రాజమహేంద్రవరం సిటీ జడ్ కేటగిరీలో ఉంది. దీంతో ప్రస్తుతం ఇక్కడి రైల్వే, ఎల్ఐసీ, పోస్టల్ తదితర ఉద్యోగులకు 10 శాతం హెచ్‌ఆర్‌ఏ లభిస్తున్నది. ఇది 20 శాతం వరకూ పెరిగే అవకాశం ఉంది. దీంతో పాటు నగరపాలక సంస్థలోని డ్రైనేజీ, పార్కులు వంటి అభివృద్ధికి, మౌలిక సదుపాయాలు కల్పనకు మరిన్ని నిధులు సమకూరుతాయి. త్వరలోనే వై కేటగిరీలోకి ఆమోదం లభిస్తుందని ఎంపీ పురందేశ్వరి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భార్యను వేధించిన భర్తకు 18 నెలలు జైలు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16: భార్యను వేధించిన భర్తకు 18 నెలల జైలు శిక్ష రూ5వేలు జరిమాన విధిస్తూ రాజమహేంద్రవరం ఐదో ఏజెఎఫ్ న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి తీర్పునిచ్చారు. రాజమహేంద్రవరం మహిళా పోలీసుల కథనం ప్రకారం. రాజమహేంద్రవరానికి చెందిన యువతితో 2014లో ఏలూరు మండలం దొండపాడు గ్రామానికి చెందిన మోహనకృష్ణకు వివాహమైంది. 2018లో బాధితురాలు తన భర్త వేదిస్తున్నాడని రాజమహేంద్రవరం మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి బుధవారం మోహనకృష్ణకు 18 నెలల జైలు, రూ.5 వేలు జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ సబ్జెక్టులో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆసక్తి, అర్హత ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.హేమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ పీజీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 19వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21న జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ చెప్పారు.

అన్నసమారాధనలు

చాగల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామదేవత పటిమ్మ పాత ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దేవరపల్లి: స్థానిక విజయదుర్గ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు.

రాజమహేంద్రవరంలో రతన్‌టాటా

ఇన్నోవేషన్స్ హబ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చారిత్రక రాజమహేంద్రవరంలో ప్రముఖ వ్యాపారవేత్త రతన్‌టాటా పేరుమీద రతన్‌టాటా ఇన్నోవేషన్స్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో 5 చోట్ల ఈ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గోదావరి జిల్లాలకు కేంద్రంగా రాజమహేంద్రవరంలో ఒక హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సెంట్రల్ హబ్ అమరావతిలో ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజమహేంద్రవరం అభివృద్ధికి ఈ హబ్ విశేషంగా ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

జాతీయ టెన్నీకాయిట్ పోటీల్లో సరస్వతికి రజతం



దేవరపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెం హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న రాపాక సరస్వతి జమ్ములో జరిగిన జాతీయ టెన్నీకాయిట్ సబ్ జూనియర్ పోటీల్లో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్‌ఎం పేరం రవీంద్రనాథ్ వ్యాయమోపాధ్యాయురాలు సరస్వతి అభినందించారు.

దోమల నివారణకు చర్యలు

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు దొమ్మేరు సర్పంచ్ తానేటి కుమారి అన్నారు. గ్రామంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా బుధవారం గంబూసియా చేపలను వదిలిపెట్టారు.ఈ చేపలు నిల్వ ఉన్న నీటిలో ఉన్న దోమల లార్వాను తినడం వల్ల దోమలు పెరగకుండా నివారించవచ్చునన్నారు.పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో వేములూరు, పెనకనమెట్ట, పశివేదల గ్రామాల్లో దోమల వ్యాప్తిని అరికట్టడానికి గంబూసియా చేపలను వదిలిపెట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.



బైక్‌కు రాయి తగిలి పడి..

యువకుడి మృతి

గోపాలపురం, అక్టోబరు 16: అత్తారింటికని బయలుదేరిన వ్యక్తి అదుపుతప్పి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కే.సతీష్‌కుమార్ వివరాల ప్రకారం... గోపవరం గ్రామానికి చెందిన జాలిపర్తి సుధీర్ (30)కి కరగపాడుకు చెందిన కొక్కిరిపాటి దుర్గశ్రీతో రెండేళ్ళ క్రితం వివాహం అయ్యిందన్నారు. గోపవరంలోని ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న సుధీర్ అత్తారింట్లో ఉన్న భార్యను తీసుకురావడానికి బైక్‌పై కరగపాడు వెళుతుండగా మార్గమధ్యలో రాంపాలెం శివారులో అదుపుతప్పి రాయిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని అన్నారు. అతని భార్య దుర్గాశ్రీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

దేవరపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన దేవరపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యు ల వివరాల ప్రకారం...దేవరపల్లి గ్రామానికి చెందిన కాగిత ప్రసాద్(62) కాఫీహోటల్‌లో పనిచేస్తూ మద్యానికి బానిసగా మారాడు. బుధవారం తెల్లవారుజామున తల్లి వద్ద నుంచి గౌరీపట్నంలోని కాఫీ హోటల్‌లో పని చేయడానికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా దేవరపల్లి పెట్రోల్ బంకు వద్దకు వచ్చేటప్పటికి బండిని పక్కనపెట్టి కుప్పకూలి పడి పోయాడు. పెట్రోలు బంకు సిబ్బంది అతన్ని కదిలించగా స్పృహలేక పోవడంతో పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్‌ఐ వీ.సుబ్రహ్మణ్యం సంఘటన ప్రాంతానికి వచ్చి ప్రసాద్ మృతి చెందినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉండగా భార్య, ఇద్దరు కుమారులు 20 ఏళ్ళ క్రితమే మృతి చెందగా కుమార్తె వివాహమై రాజమండ్రిలో ఉంటోంది. దీంతో తల్లి వద్ద ఉంటున్న ప్రసాద్ మద్యానికి బానిస అయ్యాడని తెలిపారు. తమ్ముడ కాగిత భాస్కరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేత

నల్లజర్ల, అక్టోబరు 16: గోపాలపురం మండలం గోపాలపురంలో ఏసన్న మినిస్ట్రీస్ సంఘ సభ్యుడు కానుబోయిన పోసిబాబు ఇల్లు ఇటీవల వర్షాలకు పడిపోవడంతో ఎమ్మెల్యే తక్షణసాయం కింద రూ.10 వేలు అందించారు. బుధవారం నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో పోసిబాబు కుటుంబం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును కలిసి తమ సమస్య తెలిపారు. తాను రూ.10 వేలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ తాడేపల్లి ఏసు రాజు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్య..

కనరు..వినరు!



కంపుకొడుతున్న పట్టణాలు

- భారంగా చెత్త తరలింపు
- వెన్నాడుతున్న సిబ్బంది కొరత
- పర్మినెంట్ సిబ్బంది లేక ఇక్కట్లు
- తాత్కాలిక కార్మికులతోనే సరి
- అటకెక్కుతున్న స్వచ్ఛభారత్
- అయినా పట్టని అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అధికారులు మాట్లాడితే స్వచ్ఛ భారత్ అంటారు.. అయితే జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో చూస్తే మాత్రం పారిశుధ్యం అధ్వానంగా ఉంది. సిబ్బంది కొరత కారణంగా పట్టణాల్లో పారిశుధ్యం పడకేస్తుంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలులోనూ మరింత మంది పారిశుధ్య సిబ్బంది అవసరం ఉంది. అయినా అటువైపు చూసే వారే కరువయ్యారు. రాజమహేంద్రవరంలో సుమారు నాలుగున్నరలక్షల మంది జనాభా ఉన్నారు. 50 డివిజన్లకుగా నగరం విస్తరించి ఉంది.కొవ్వూరులో 23 వార్డులు, నిడదవోలులో 25 వార్డులు ఉన్నాయి. మూడు పట్టణాల్లోనూ నివాసగృహాలు, వ్యాపార సంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, కూరగాయాలు, నిత్యావసరాలు వ్యాపార సముదాయాలు, హోటల్స్ తదితర వ్యాపార కేంద్రాల నుంచి ప్రతి రోజు పెద్ద ఎత్తున చెత్త వస్తుంది. అయితే ఆ చెత్త తరలించే సిబ్బంది కొరత మాత్రం నేటికి వేధిస్తూనే ఉంది.

పారిశుధ్య కార్మికుల కొరత

రాజమహేంద్రవరం పారిశుధ్యం విభాగంలో 28 సర్కిల్స్ ఉన్నాయి. 28 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నారు. ప్రతి రోజు కార్మికులు రెండు షిఫ్టులుగా పనులు చేస్తుంటారు. ఉదయం 5 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య కార్మికులు పనిచేస్తుంటారు.రాజమహేంద్రవరం వంటి నగరంలో పారిశుధ్య పనులకు తక్కువ అనుకుంటే 2 వేల మం ది కార్మికులు అవసరం.అయితే కార్పొరేషన్‌లో ఉన్న 1150 మంది కార్మికుల్లో డిప్యుటేషన్‌పై 176 మంది అధికారుల ఇళ్లు, ప్రాథమిక ఆసుపత్రుల్లో పనిచేస్తున్నారు.మిగిలిన 974 మంది కార్మికుల్లో డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్లు, వెహికల్ యార్డులో పనిచేసే వారు మినహాయిస్తే సుమారు 800 మంది ఉంటారు. వారిలో పర్మినెంట్ సుమారు 300 మంది ఉంటారు. మిగిలిన 500 మంది కార్మికులు నెంబరు 12 సొసైటీల ద్వారా తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్నారు. సగటున 50 కుటుంబాలకు ఒక్క పారిశుధ్య కార్మికుడు కింద లెక్కించినా నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో ఉన్న కార్మికులు, నగర జనాభాకు ఎంత మాత్రం పొంతనలేని పరిస్థితి. రాజమహేంద్రవరంలో రెండు దశాబ్దాలుగా పారిశుధ్య కార్మికులు సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. ఫలితంగా పారిశుధ్యం ఇబ్బందికరంగా మారుతుంది. దినిపై ఎంత మంది కమిషనర్లు వచ్చినా చర్యలు కానరావడంలేదు. రానున్న పుష్కరాల నేపథ్యంలోనైనా సిబ్బందిని తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి పుష్కరాలకు కార్మికులను తీసుకోవడం అటుపై మళ్లీ వారిని విధుల నుంచి తీసివేయడం జరుగుతుంది.ఈ విధంగా కాకుండా నగరంలో అవసరమైన కార్మికులను నియమించుకోవాల్సి ఉంది.

60 వాహనాల్లో చెత్త తరలింపు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి రోజు చెత్తను తరలించేందుకు సుమారు 60 పైబడి వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ వాహనాల్లో రోజుకు 162 మెట్రిక్ టన్నుల చెత్తను కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. 11 టిప్పర్లు, 17 డంపర్ ప్లేసర్లు, 12 ట్రాక్టర్లు, 40 సీఎన్‌జీ టాటాఏసీ వాహనాల్లో నగరంలో 50 డివిజన్ల నుంచి ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్యలో చెత్త తరలిస్తున్నారు. అయినా నగరంలో ఇంకా చెత్త పేరుకుపోతూనే ఉంది.

డోర్ టూ డోర్ చెత్త సేకరణ..

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో డోర్ టు డోర్ చెత్త సేకరణ ప్రక్రియ నడుస్తోంది. సుమారు 40 వాహనాలు వినియోగిస్తున్నారు. గతంలో నగరపాలక సంస్థ పుష్ కార్డులను వినియోగించేది. మరి కొంతకాలం రిక్షాలను వినియోగించారు. ఇప్పుడు టాటాఏసీ వాహనాలు వినియోగిస్తున్నారు. గత నెలలో టాటా ఎసీ సీఎన్‌జీ వాహనాలు కాంట్రాక్టు బిల్లుల పెండింగ్ సమస్యలతో నిలిచిపోయింది. దీంతో కార్పొరేషన్ కు ఉన్న 20 వాహనాలపై అదనపు భారం పడి ఇంటింటా చెత్తసేకరణ ఇబ్బందిగా మారింది. మళ్లీ ఇప్పుడు ఆ వాహనాలు రోడ్డెక్కాయి. ఎంత వాహనాలున్నా సిబ్బంది కొరత వెన్నాడుతూనే ఉంది.

చెత్త తరలింపు ఎలా..

కొవ్వూరు/నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లాలో మూడు పట్టణాలు ఉన్నాయి. వీటిలో రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు పట్టణాలు. కొవ్వూరు, నిడదవోలులోను పారిశుధ్య సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. కొవ్వూరులో 125 మంది కార్మికులు ఉండగా 95 మంది పర్మినెంట్ కార్మికులు, 30 మంది తాత్కాలిక కార్మికులు ఉన్నారు. 13 మంది పారిశుధ్య సిబ్బంది కొరత ఉంది. నిడదవోలులోనూ ఇదే పరిస్థితి ఉంది. నిడదవోలులో 120 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. వీరిలో సుమారు 25 మంది మాత్రమే పర్మినెంట్ కార్మికులు. మిగిలిన 95 మంది తాత్కాలిక కార్మికులే. సుమారు 50 మంది కార్మికుల కొరత ఉంది. కొవ్వూరులో అయితే డంపింగ్ యార్డ్‌లేక కార్మికులు నరకం చూస్తున్నారు. మరో వైపు వాహనాలు మూలకు చేరాయి. ప్రస్తుతం ట్రై సైకిళ్లపైనే చెత్త తరలిస్తున్నారు. దీంతో చెత్త తరలింపు భారంగా మారుతోంది.



నిడదవోలులో

బరోడా బ్యాంక్ 51వ శాఖ



నిడదవోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా రూ.8 వేల కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నామని స్వయం సహాయక సంఘాలకు రుణాలు, వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యమిస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేష్‌కుమార్ అన్నారు. బుధవారం నిడదవోలులో బ్యాంక్ ఆఫ్ బరోడా 51వ శాఖను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బరోడా బ్యాంక్ గృహ, వ్యాపార, పరిశ్రమలకు సౌర విద్యుత్‌శక్తి ఏర్పాటు చేసుకోవడానికి ప్రత్యేక రుణాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంవీఎస్ సుధాకర్, ఎస్.రవీంద్రనాథ్ ఠాగూర్, ఏవీ భాస్కరం, కె.ప్రియబిందు పాల్గొన్నారు.

తుంపర సేద్యంతో నీరు ఆదా

చాగల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పంటకు నీరు సమతూకంలో అందించడానికి తుంపర సేద్యం సహాయపడుతుందని ఉద్యానవన అధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చిక్కాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా డ్రిప్ ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను ఉపయోగించుకుని ఉద్యాన పంటలకు డ్రిప్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారి కే వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ వేరుశనగ సాగుచేసే రైతులు పంటలో ఎకరాకు 200 కిలోల జిప్సం తప్పనిసరిగా వాడాలని, దీని వల్ల దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నెట్‌ఫిర్మ్ డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు

వెంకటేశ్వరరావు మృతి

నిడదవోలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నిడదవోలు టీడీపీ సీనియర్ నాయకుడు, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖుడు కేదారిశెట్టి వెంకటేశ్వరరావు(71) బుధవారం తెల్లవారు జామున మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురైన ఆయన హైదరాబాద్, బెంగుళూరులో చికిత్స పొందుతూ వచ్చారు. బుధవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే బూరు గుపల్లి శేషారావు, టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు.. వెంకటేశ్వరరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పల్లె పండుగలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు కేటాయించిన నిధులను గ్రామాభివృద్ధికి మాత్రమే వినియోగిస్తామని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పల్లె పండుగలో భాగంగా బుధవారం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. గ్రామస్తుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అదనపు వసతులకు మండల పరిషత్ నిధులు కేటాయించాలని ఎంపీపీ పోసిరాజును కోరారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపాటి ప్రకాశం, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, గంటా కృష్ణ, మద్దిపాటి రామారావు, చెరుకూరి వెంకట్రావు, మద్దుకూరి శ్యాం, గెడ్డం జగన్, రాపాక శ్యాం తదితరులు పాల్గొన్నారు.

అచ్చిబాబు పరామర్శ



కలవలపల్లిలో అన్నపూర్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆంధ్రా సుగర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అచ్చిబాబు తదితరులు

చాగల్లు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కలవలపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు అబ్బూరి సీతారాముడు తల్లి అన్న పూర్ణమ్మ మృతి నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను ఆంధ్ర సుగర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుత రామయ్య బుధ వారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయనతో పాటుగా టీడీపీ నాయకులు జి.వెంకట ప్రసాద్, ఆళ్ళ హరిబాబు, తాళ్ళూరి ప్రసాద్, వై.అబ్బులు చౌదరి, తాళ్ళూరి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలొద్దు



బస్టాండ్ సెంటరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకుడు రాంబాబు తదితరులు

నిడదవోలు, అక్టోబరు 16: పట్టణంలోని బస్టాండ్ సెంటరులో నివాస ప్రాంతాల వద్ద మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వవద్దని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు కోరారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్ సెంటరులో సీపీఎం నాయకులు, కార్యకర్తలతో ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు జువ్వల రాం బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో బస్టాండు సెంటరులో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ప్రజా ఆందోళనతో వేరే ప్రాంతానికి తరలించారని అన్నారు. తిరిగి మళ్లీ అదే ప్రాంతంలో దుకాణం ఏర్పాటుకు సిద్ధం అవుతున్నారని ఇది సరికాదన్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మహిళలతో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సపక్ తక్రా జట్టుకు విద్యార్థుల ఎంపిక

దేవరపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సపక్‌తక్రా ఎంపిక పోటీలు మండలంలోని రామన్నపాలెం జడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. జిల్లాస్థాయి సీనియర్ విభాగంలో చపక్‌తక్రా 70 మంది బాలురు, 70 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి చపక్‌తక్రా పోటీలకు ఎంపికైన బాలురు ఎల్.గణపతి, సీహెచ్ సతీష్, కే.పవన్, వంశీ, పీ.సాయి, పీ.సారధి, బాలికల జట్టు జీ.రోహిత, దుర్గా, మాధురిశ్రీ, ఎం.మహాలక్ష్మి, ఎస్‌కే.మనీషా బేగం, ఎం.లాస్య, మానసలు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు జిల్లా చపక్‌తక్రా కోచ్ ఏలూరు శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి చపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పేరం రవీంద్రనాథ్ పీడీ సరస్వతి, రాజేంద్ర, ఆచంట వెంకటేశ్వరరావు, శేఖర్, మునేశ్వరరావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పురపాలక సంఘ పరిధిలో హెడ్ వాటర్ వర్క్సు నిర్వహణ నిమిత్తం 17న తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ కె.నాగేంద్రకుమార్ తెలిపారు. వాటర్‌వర్క్సు నిర్వహణలో భాగంగా గురువారం సాయంత్రం నీటి సరఫరాకు ఏర్పడుతున్న అంతరాయానికి ప్రజలు సహకరించాలన్నారు. తిరిగి 18న ఉదయం నుంచి తాగునీరు సరఫరా యథావిధిగా జరుగుతుందన్నారు.

నేటి నుంచి జిల్లా క్రీడా జట్ల ఎంపిక

దివాన్‌చెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): క్రీడాజట్ల ఎంపిక గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి ఎస్.ఆర్.కె. స్వామి తెలిపారు. బుధవారం ఆయన వీటి వివరాలు తెలిపారు. ఫుట్‌బాల్ అండర్ 14 బాలురు, బాలికల జిల్లా జట్లు ఎంపిక గురువారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కెవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతాయన్నారు. అథ్లెటిక్స్ అండర్ 14 బాలబాలికల జట్టు ఎంపికలు 24న, అండర్ 17 బాలబాలికల జట్టు ఎంపికలు 25న రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరుగుతుందన్నారు. బాల్‌బాడ్మింటన్, త్రోబాల్‌లో అండర్ 14, 17 బాలికల జట్టు ఎంపికలు 29న, బాలుర జట్టు ఎంపికలు 30న అనపర్తిలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తారని స్వామి తెలిపారు.



మలకపల్లి సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఆంధ్ర సుగర్స్ జెఎండి పెండ్యాల అచ్చిబాబు

పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన ఆంధ్రా సుగర్స్ జెఎండీ అచ్చిబాబు

తాళ్లపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించి, సొసైటీ మరింత ఆర్థిక పరపతిని పెంచాలని ఆంధ్ర సుగర్స్ జెఎండి పెండ్యాల అచ్చిబాబు అన్నారు. తాళ్లపూడి మండలం మలకపల్లి విశాల పరపతి సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకులో బుధవారం ఆయన అమ్మకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, జీవీ ప్రసాద్, మద్దిపాటి ప్రకాశం, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఉప సర్పంచ్ మద్దిపాటి రామరావు, విద్యుత్‌శాఖ ఏడిఏ కృష్ణనాయక్, డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ కృష్ణకాంత్, సొసైటీ ఇన్‌చార్జి కె.సుబ్బారావు, కార్యదర్శి సత్యనారాయణ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, సూరపనేని చిన్ని, గంటా కృష్ణ, చెరుకూరి వెంకట్రావు, కె.బుచ్చిరాయుడు, తహశీల్దార్ రవీంద్రనాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కొవ్వూరు డిపో మేనేజర్ కుమార్

కొవ్వూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రానున్న కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలను దర్శించేందుకు వీలుగా కొవ్వూరు డిపో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. కొవ్వూరు డిపో నుంచి నవంబరు 2 నుంచి 30 వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు.

పంచారామాలు: అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట శైవ క్షేత్రాలకు బస్సులు నడుపుతున్నామన్నారు. నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో ఆదివారం రాత్రి 7 గంటలకు డిపో నుంచి బయలుదేరి సోమవారం రాత్రి 7 గంటలకు తిరిగి డిపోకు చేరుకుంటాయన్నారు. ఉద్యోగస్తుల కోసం కార్తీకమాసం శనివారాలు 2, 9, 16, 23, 30 తేదీల్లో రాత్రి 7 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 7కి డిపోకు చేరుకుంటాయన్నారు. పల్లెవెలుగు టిక్కెట్ ఒక్కరికి రూ.700, సూపర్‌లగ్జరి రూ.1070 ఉంటుందని ఆయన తెలిపారు.

ఏకాదశరుద్రుల యాత్ర: కార్తీక సోమవారాలు వ్యాగేశ్వరం, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, పాలగుమ్మి, మోసలపల్లి, ముక్కామల, నేదునూరు, వక్కలంక, ఇరుసుమండ, ఏకాదశరుద్రులతో పాటు అయినవిల్లి వినాయకుడి దర్శనం చేయిస్తామన్నారు. నవంబరు 4, 11, 18, 25 తేదీలు సోమవారాలు ఉదయం 5 గంటలకు కొవ్వూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరతాయన్నారు. మనిషికి ఒక్కరికి టిక్కెట్ రూ.350 ఉంటుందన్నారు.

శబరిమల యాత్ర: శబరిమల భక్తులకు కొత్త సూపర్‌లగ్జరి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అయిదు రోజుల యాత్ర విజయవాడ, ఎరిమేలి, శబరిమల, తిరుపతికి ఒక్కరికి రూ.4600 అని తెలిపారు.

ఏడు రోజుల యాత్ర: శ్రీశైలం, మహానంది, శ్రీపురం, అరుణాచలం, శబరిమల, పళని, కాణిపాకం, తిరుపతి, విజయవాడ మీదుగా కొవ్వూరు చేరుకుంటుందన్నారు. టిక్కెట్ ఒక్కరికి రూ.5600 చెల్లించాలన్నారు.

10 రోజుల యాత్ర: ద్వారకా తిరుమల, విజయవాడ, శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, హంపి, గోకర్ణం, ముకాంబిక, ఉడిపి, శృంగేరి, ధర్మస్థలి, మైసూర్, శ్రీరంగపట్నం, గురువాయూర్, పంబ, కన్యాకుమారి, మధురై, జంబుకేశ్వరం, శ్రీరంగం, అరుణాచలం, కంచి, తిరుపతి, శ్రీకాళహస్తి దేవాలయాల దర్శనం చేయిస్తామన్నారు. టిక్కెట్ ధర ఒక్కరికి రూ.7500 అని తెలిపారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప భక్తులు, ప్రయాణికులు, ఆధ్యాత్మికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టూర్ ప్యాకేజీలతో పాటు విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను నడుపుతుందన్నారు. బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉన్నట్టయితే వారు కోరినచోట నుంచి ఏ రోజైనా బస్సును ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు.

రతన్‌టాటా మృతి దేశానికి తీరనిలోటు

దేవరపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రతన్‌టాటా మృతి పారిశ్రామిక రంగానికి తీరని లోటని దుద్దుకూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కంటిపూడి సుబ్బారావు అన్నారు. దుద్దుకూరులో రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు సాంబ, శ్రీనివాసరావు, శ్రీనివాస్, కడియం సూర్యనారాయణ, కొయ్యలమూడి తాతారావు తదితరులు పాల్గొన్నారు.